TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &chief editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 5 బుధవారం 5-08-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వేల :6.00/-

## 18 ఏండ్లకే ప్రొఫెసర్..

### 306 ఏండ్ల రికార్డు బద్దలు



ఫ్లోరిడా

అమెరికాలోని ఫ్లోరిడాకు చెందిన నాథన్ థామస్ 18 ఏండ్ల 346 రోజుల్లోనే అతి పిన్న ప్రొఫెసర్‌గా గిన్నిస్ ప్రపంచ రికార్డుకు ఎక్కి 306 ఏండ్లుగా ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు. అతను ప్రస్తుతం మయామీ డేడ్ కాలేజీలో ఇంజినీరింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా చేరి విద్యార్థులకు పాఠాలు చెబుతున్నాడు.అంతకుముందు ఈ రికార్డు స్కాటిష్ గణిత శాస్త్రవేత్త కోలిన్ మాక్లరిన్ పేరుపై ఉంది. అతను 19 ఏండ్ల వయసులో 1717లో ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు.




## గుజరాత్‌లో చాందీపుర వైరస్ విజృంభణ

- 22 మంది చిన్నారుల మృతి.. పలువురికి చికిత్స
- 184 అనుమానిత కేసులు.. 35 మందికి వైరస్ నిర్ధారణ
- 15 ఏండ్లలోపు పిల్లలపైనే వైరస్ ప్రభావం
- ఇసుక ఈగల ద్వారా వైరస్ వ్యాప్తి.. అప్రమత్తమైన అధికారులు
- ప్రభావిత ప్రాంతాల్లో క్రిమిసంహారక మందుల పిచికారీ
- జ్వరం, వాంతులు, మూర్ఛ లక్షణాలపై ప్రజలకు హెచ్చరిక
- ఐసీయూ, వెంటిలేటర్ సదుపాయాలు సిద్ధం చేయాలని ఆస్పత్రులకు ఆదేశాలు
- వైరస్ నియంత్రణకు ఆరోగ్య శాఖ ముమ్మర చర్యలు
- అవగాహన కార్యక్రమాలతో ప్రజలను అప్రమత్తం చేస్తున్న ప్రభుత్వం

గుజరాత్

మరో కొత్త వైరస్ వెలుగులోకొచ్చింది. చిన్నారుల ప్రాణాలు తీస్తోంది. ఈ అరుదైన వైరస్ కారణంగా ఇప్పటికే 22 మంది చిన్నారులు మృతి చెందగా, మరి కొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుజరాత్ లో 'చాందీపుర్ వైరస్' కలకలం రేపుతోంది. రాష్ట్రంలో ఇప్పటివరకు 184 మందికి పైగా అనుమానిత కేసులు నమోదు కాగా, వారిలో 35 మందికి వైరస్ సోకినట్టు నిర్ధారణ అయింది. ప్రభుత్వం ప్రభావిత ప్రాంతాల్లో అధికారులను అప్రమత్తం చేసింది. గుజరాత్ లో ఈ ప్రాణాంతక వైరస్ బారిన పడి ఇప్పటివరకు 22 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయినట్టు రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి ప్రఫుల్ పన్సేరియా వెల్లడించారు. మరో 11 నమూనాల పరీక్ష ఫలితాలు రావాల్సి ఉందని తెలిపారు. పాజిటివ్ నిర్ధారణ అయిన ఏడుగురు పిల్లలు రాష్ట్రంలోని వివిధ సివిల్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో ఆరుగురు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. గాంధీనగర్, సబర్కాంత-హిమ్మత్‌నగర్, పటాన్, రాజ్‌కోట్, భావ్‌నగర్ ఆస్పత్రుల్లో చేరిన చిన్నారులకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణల

-మిగతా 2 లో



### 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు రేవంత్ రెడ్డి

## విదేశీ పర్యటనలు

- దాదాపు రెండు వారాలకు పైగా సాగనున్న పర్యటన
- గ్లోబల్ ఇన్వెస్టర్లు, పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక సమావేశాలు
- రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే ప్రధాన లక్ష్యం
- 'ఫ్యూచర్ సిటీ' లో పెట్టుబడులను ప్రోత్సహించడంపైనే దృష్టి

హైదరాబాద్

ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన చేయనున్నారు. యూకే, అమెరికా, జర్మనీ, చైనా వెళ్లనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు విదేశీ పర్యటనలకు వెళ్లనున్నారు. తెలంగాణ రాష్ట్రానికి భారీ విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ప్రతిపాదిత వివరాల ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు నుండి సెప్టెంబర్ వరకు దాదాపు రెండు వారాలకు పైగా విదేశాలలో పర్యటించనున్నారు. అమెరికా , యునైటెడ్ కింగ్‌డమ్ ., కెనడా మరియు ఇతర కీలక దేశాలలోని ప్రముఖ నగరాల్లో పర్యటించి గ్లోబల్ ఇన్వెస్టర్లు, పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా ప్రమోట్ చేయడం, ముఖ్యంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న

-మిగతా 2 లో

# పట్టభద్రుల ఎన్నికలకు సై

### కాంగ్రెస్ ఫోకస్..విపక్షాలూ సన్నద్ధం

- ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే రాజకీయ వేడి
- అభ్యర్థుల ఎంపికపై పార్టీల్లో ముమ్మర కసరత్తు
- కాంగ్రెస్‌లో కొత్త ముఖాలపై చర్చ.. బలమైన అభ్యర్థి కోసం అన్వేషణ
- తీన్మార్ మల్లన్న భవితవ్యంపై ఆసక్తికర చర్చ
- ఏనుగుల రాకేశ్‌రెడ్డిపైనే బీఆర్ఎస్ దృష్టి?
- బీజేపీలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పేరే ప్రధానంగా వినిపింపు
- వామపక్షాల ఉమ్మడి అభ్యర్థిపై చర్చలు
- పట్టభద్రుల ఓట్లే విజయాన్ని నిర్ణయించే కీలక అంశం
- సామాజిక సమీకరణాలతో అభ్యర్థుల ఎంపికకు ప్రాధాన్యం
- ఎమ్మెల్సీ ఎన్నికలు అన్ని పార్టీలకు ప్రతిష్ఠాత్మక పోరు
- యువత, నిరుద్యోగుల ఓట్లపై అన్ని పార్టీల ఫోకస్
- వరంగల్--నల్లగొండ--ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గంలో ఎన్నికల సందడి




వరంగల్

వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలో ఎన్నికల వాతావరణం నెలకొంది. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు పోటీకి సై అంటున్నాయి. వివిధ పార్టీల నుంచి ఆశావహులు పోటీకి సన్నద్ధమవుతున్నారు. అధికార కాంగెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, వామపక్షాలు, బీజేపీ పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత శాసనసభ ఎన్నికల్లో జనగామ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి

-మిగతా 2 లో

## ఉదయనిధి స్టాలిన్ అరెస్టు.. విడుదల



- త్రిషపై వివాదాస్పద వ్యాఖ్యలపై కేసు నమోదు
- అరెస్టు చేసిన తంజావూరు పోలీసులు
- కోర్టును ఆశ్రయించిన డీఎంకే నేతలు.. బెయిల్ మంజూరు.. విడుదల
- అరెస్టు సందర్భంగా చెన్నైలో ఉద్రిక్తత
- పోలీసు వాహనానికి అడ్డుపడిన డీఎంకే శ్రేణులు
- టీవీకే చీఫ్, సీఎం విజయ్‌పై ఎంకే స్టాలిన్ ఘాటు విమర్శలు

02

## ట్రంప్ ఒత్తిడికి లొంగిన మోడీ



- ఈ20 పై సరైన నిర్ణయాలు తీసుకోండి
- ప్రజలకు రెండు ఆప్షన్లు ఇవ్వాలి
- తమకు నచ్చిన పెట్రోల్ కు అనుమతినివ్వాలి
- ప్రధాని నివాసం ముట్టడికి ఆప్ ప్రయత్నం నివాసం వద్దే అడ్డుకున్న పోలీసులు
- పలువురు నేతల అరెస్టు, దిగ్బంధం
- తక్కువ ధరకే విక్రయించాలని డిమాండ్

02

### పక్కాగా పోలీస్

# పరీక్షలు

### కోచింగ్ సెంటర్లపై నిఘా పెట్టండి

- పరీక్షలకు భంగం కలిగించే కుట్రలు ఛేదించండి
- అంతా పారదర్శకంగా జరగాలి
- ఎలాంటి దుష్ప్రచారాలకు ఆస్కారం ఇవ్వొద్దు
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

02

పోలీస్ నియామకాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావివ్వొద్దని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 7,437 పోస్టుల నియామకాలను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, సోషల్ మీడియా దుష్ప్రచారం, నకిలీ వెబ్‌సైట్లు, మోసగాళ్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు.





## తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు

- హైదరాబాద్‌కు నేడు ఎల్లో హెచ్చరికలు జారీ
- వాతావరణశాఖ సోమవారం ఉత్తర తెలంగాణతో పాటు హైదరాబాద్‌లో భారీ వర్షం
- క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో పలుచోట్ల వర్షం

హైదరాబాద్

: నైరుతి రుతుపవనాలు కదలికలు చురుగ్గా ఉన్నాయి. వీటి ప్రభావంతో హైదరాబాద్‌లో నేడు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అంతేకాకుండా ఎల్లో అలర్ట్ కూడా జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో సోమవారం ఉత్తర తెలంగాణతో పాటు హైదరాబాద్‌లో కుండపోత వర్షం కురిసింది. కామారెడ్డిలో అత్యధికంగా 18.2 సెంటీ మీటర్లు, వికారాబాద్, సంగారెడ్డి వంటి జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు.

-మిగతా 2 లో



## అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ దాడి

- చర్చలపై ట్రంప్ వ్యాఖ్యలు చేసిన కొద్ది గంటలకే డ్రోన్లతో లక్ష్యం
- ఒమాన్ సమీపంలో వాణిజ్య నౌకపై దాడి
- అప్రమత్తమైన సముద్ర భద్రతా సంస్థలు
- పలు అంతర్జాతీయ మీడియా కథనాలు

వాషింగ్టన్ :

అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి. కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరాన్ని ఇరాన్ ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) డ్రోన్లతో దాడి చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. కనీసం మూడు డ్రోన్లతో ఈ దాడి జరిగినట్లు సమాచారం. కువైట్‌కు అనుకుని ఉన్న ఇరాక్‌లోని బస్రా ప్రాంతంలో కూడా భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇదే సమయంలో కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించినట్లు ప్రాంతీయ వార్తా సంస్థలు వెల్లడించాయి. అయితే ఈ ఘటనలకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికాలేదు.

-మిగతా 2 లో



### భారత నౌకపై

## క్షిపణి దాడి!

- యెమెన్ తీరంలో మునక

న్యూఢిల్లీ :

యెమెన్ తీరానికి సమీపంలో ఎర్ర సముద్రంలో క్షిపణి దాడికి గురైన భారతీయ జెండాతో కూడిన ఒక వాణిజ్య నౌక మునిగిపోయింది. ఈ ప్రమాదంలో నౌకలో ఉన్న మొత్తం 14 మంది సిబ్బందిని యెమెన్ కోస్ట్ గార్డ్ రక్షించి, మోఖా నౌకాశ్రయానికి తరలించారు.వారిలో 13 మంది భారతీయులు కాగా, ఒకరు విదేశీ

-మిగతా 2 లో

## పార్లమెంటును అవమానిస్తున్న మోడీ, షా

- సమస్యలపై సమాధానాలు దాట వేస్తున్నారు
- రామమందిర విరాళాల చోరీ, విద్యార్థులపై లాఠీఛార్జ్ అంశాలపై సర్కార్ భయపడుతోంది
- వాస్తవాలు వెలుగులోకి రావాలంటే ఉభయ సభల్లోనూ చర్చ జరగాలి సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే డిమాండ్

న్యూఢిల్లీ

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే. రామమందిర విరాళాల చోరీ, విద్యార్థులపై లాఠీఛార్జ్ అంశాలపై సమాధానాలు ఇవ్వడానికి భయపడి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఇలా చేస్తూ పార్లమెంటును అవమానిస్తున్నారని విమర్శించారు. వాస్తవాలు వెలుగులోకి రావాలంటే పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఈ రెండు

-మిగతా 2 లో



నవ సంఘర్షణ
తెలుగు దినపత్రిక
బుధవారం 5 -08-2026

# కౌన్సిలర్ ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఆర్మూర్,ఆగస్టు ఆగస్టు 4 నవ సంఘర్షణ
ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లో 8,9,24 వ వార్డులకు చెందిన లబ్ధిదారులకు 10 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు రాగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం 9వ వార్డు కౌన్సిలర్ పోచంపేట్ శ్రీను ఆధ్వర్యంలో బిజెపి నాయకులు 9 వ వార్డుకు చెందిన లబ్ధిదారుడైన కొండ గంగాధర్ ఇంటికి వెళ్లి ఆయన భార్యకు 1,61,000/-రూపాయల చెక్కును ఇవ్వడం జరిగింది. అలాగే 8 వ వార్డు,24 వ వార్డులలో కూడా బిజెపి నాయకులు చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. చెక్కులను తీసుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ మాలాంటి నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు త్వరగా వచ్చేందుకు కృషి చేసిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి,మా వార్డు కౌన్సిలర్ పోచంపేట్ శీను కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ పోచంపేట్ శ్రీనివాస్, ఆర్మూర్ పట్టణ కార్యదర్శి కొత్తగొల్ల సతీష్,బీజేవైఎం జనరల్ సెక్రెటరీ గోజూరు మధు,తోట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మూర్ లో నూతన ఇంటిగ్రేటెడ్ బస్ డిపో ను ఏర్పాటు చేయాలి

**-ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి**



ఆర్మూర్,ఆగస్టు ఆగస్టు 4 నవ సంఘర్షణ
ఆర్మూర్ నియోజకవర్గ ప్రజల రవాణా సౌకర్యాల మెరుగుదలకు సంబంధించి టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డిని కలిసి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ పట్టణంలో నూతన ఇంటిగ్రేటెడ్ బస్ డిపో మరియు అత్యాధునిక బస్టాండ్ నిర్మాణానికి అన్ని అనుమతులు మంజూరు చేయాలని కోరారు.అలాగే ప్రస్తుతం ఉన్న ఆర్మూర్ బస్టాండ్‌ను ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా,నందిపేట్ మండల ప్రజల చిరకాల కోరిక అయిన నందిపేట్ బస్ డిపోను మంజూరు చేసి అక్కడి ప్రజలకు మెరుగైన ఆర్టీసీ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
అలాగే నియోజవర్గానికి నూతన ఎలక్ట్రిక్ బస్సులు మరియు నియోజకవర్గంలో అన్ని రూట్ లో సరిపడా బస్సు లని నడపాలని కోరడం జరిగింది. ఈ అంశాలపై టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి సానుకూలంగా స్పందించి,ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి హామీ ఇవ్వడం జరిగింది.

# తల్లిపాలు బిడ్డలకు చాలా శ్రేష్టమైనవి చిట్టెమ్మ




దేవరకొండ ఆగస్టు 4 నవ సంఘర్షణ
దేవరకొండ మండలం అచ్చమ్మ కుంట తండా గ్రామంలో అంగన్వాడి కేంద్రం నందు సూపర్వైజర్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. సూపర్వైజర్ చిట్టెమ్మ మాట్లాడారు. ప్రసవానికి దగ్గర్లో ఉన్న ప్రతి గర్భిణీ కుటుంబాన్ని అంగన్వాడీ టీచర్స్ సందర్శించి గర్భిణీ స్త్రీకి మరియు కుటుంబ సభ్యులందరికీ తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని ఆమె టీచర్లకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపు మొర్రుపాలను పట్టించాలని ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆరు నెలల నుండి అదనపు ఆహారంతోపాటు తల్లిపాలు కొనసాగించాలని, తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని,సూపర్ చిట్టమ్మ ఈ అవగాహన సదస్సులో టీచర్లకు తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు బాలింతలు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నంబావి మండల కేంద్రం లో అద్దె భవనాల్లోనే ప్రభుత్వ పాలన

**-తహసీల్దార్ కార్యాలయనికి సొంత భవనాలు లేవు**
**-ప్రజల ఇబ్బందులు పట్టించుకునే వారు ఎవరూ లేరా**



వనపర్తి జిల్లా ఆగస్టు 4 నవ సంఘర్షణ
చిన్నంబావి మండలం ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా, ప్రభుత్వ పరిపాలనకు కేంద్ర బిందువులైన తహసీల్దార్ కార్యాలయం, ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతుండడం విచారకరం. ప్రజలకు నిత్యం సేవలందించే ఈ కీలక కార్యాలయాలకు శాశ్వత భవనాలు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. రోజూ పదుల సంఖ్యలో రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు వివిధ అవసరాల కోసం ఈ కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు. కానీ అద్దె భవనాల్లో సరైన స్థలం, మౌలిక వసతులు టాయిలెట్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు కూడా పరిమిత వసతులతోనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి నెల అద్దె రూపంలో ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు వెచ్చిస్తున్నప్పటికీ, శాశ్వత భవనాల నిర్మాణంపై మాత్రం ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించడం లేదు. ఇదే నిధులను ప్రణాళికాబద్ధంగా వినియోగించి సొంత భవనాలు నిర్మిస్తే ప్రభుత్వానికీ, ప్రజలకూ దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుంది. మండల ప్రజల అవసరాలు, సమస్యలు ప్రజా ప్రతినిధులకు కనిపించడం లేదా అనే సందేహం వ్యక్తమవుతోంది. ఇకనైనా ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు తక్షణమే స్పందించాలి. చిన్నంబావి మండల తహసీల్దార్ కార్యాలయం, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు గౌరవప్రదమైన వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. చిన్నంబావి మండల ప్రజలు ఇప్పుడు హామీల కొరకు కాదు. సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు.

# కొప్పునూరు గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమం

**-కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్న**







వనపర్తి జిల్లా ప్రతినిధి ఆగస్టు 4 నవ సంఘర్షణ
చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో అంగన్వాడి సెంటర్లలో ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్న పాల్గొనడం జరిగింది. గ్రామ సర్పంచు వడ్డేమాన్ పిచ్చి అన్న మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు మరియు తల్లులకు, తల్లిపాలపై అవగాహన కల్పిస్తూ తగిన సూచనలు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ సెక్రెటరీ నాగరాజు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది తో కలిసి గర్భిణీ స్త్రీలకు మరియు బాలింతలకు వివరిస్తు పలు సూచనలు చేయడం జరిగింది. తల్లిపాలు మీ బిడ్డకు ప్రకృతి ప్రసాదించిన తొలి వరం, జీవితంలో తొలి ఆరు నెలలు తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం, బలమైన రోగనిరోధక శక్తి మరియు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పునాది. సంపూర్ణ పోషకాహారం అందిస్తుంది, రోగనిరోధక శక్తిని పెంచుతుంది, మెదడు ఎదుగుదలకు తోడ్పడుతుంది. తల్లి – బిడ్డల మధ్య అనుబంధాన్ని మరింత బలపరుస్తుంది. తల్లి ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తుంది. పుట్టిన వెంటనే తల్లిపాలు బిడ్డకు పట్టడం ప్రారంభించండి. తొలి 6 నెలలు తల్లిపాలే ఇవ్వండి (నీరు కూడా అవసరం లేదు). 6 నెలల తరువాత అనుబంధ ఆహారంతో పాటు 2 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించండి. ప్రతి బిడ్డకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందిద్దాం. తల్లిపాలను ప్రోత్సహిద్దాం ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మిద్దాం అని ఈ సందర్భంగా పలు సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ నాగరాజు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# తెలంగాణలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును ఆగస్టు 25, 2026 వరకు పొడిగించిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 4 నవ సంఘర్షణ
తెలంగాణ హైకోర్టు 03 ఆగస్టు 2026న జరిగిన విచారణలో ప్రస్తుతం అమల్లో ఉన్న జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఆగస్టు 25 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (TUWJF) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కొనసాగించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు.విచారణ సందర్భంగా ప్రతివాదులు ఇప్పటికే పిటిషనర్లలో ఎక్కువమందికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినట్లు కోర్టుకు తెలిపారు. అయితే ఈ వాదనపై పిటిషనర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో, ఇప్పటివరకు జారీ చేసిన అన్ని అక్రిడిటేషన్ కార్డుల పూర్తి వివరాలు మరియు జాబితాను కోర్టుకు సమర్పించాలని న్యాయస్థానం ప్రతివాదులను ఆదేశించింది. తదుపరి విచారణ తేదీ నుంచి కేసులో తుది విచారణ మరియు తుది వాదనలు ప్రారంభమవుతాయని కోర్టు స్పష్టం చేసింది. అందుకు ముందు ఇరు పక్షాలు తమ వద్ద ఉన్న అన్ని సంబంధిత పత్రాలు, ఆధారాలను కోర్టు రికార్డులో సమర్పించాలని ఆదేశించింది. ప్రతివాదులు కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో జరిగిన లోపాలను ప్రస్తావిస్తూ, సంఘటనల వారీగా తేదీలతో కూడిన నివేదికను పిటిషనర్ కోర్టులో సమర్పించగా, దానిని న్యాయస్థానం రికార్డులో భాగంగా చేర్చింది. హైకోర్టు ఇచ్చిన ఈ ఉత్తర్వులతో కేసు తుది నిర్ణయం వచ్చే వరకు రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు తమ వృత్తిపరమైన హక్కులు, ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రవేశం మరియు ప్రభుత్వ గుర్తింపుతో లభించే ఇతర సౌకర్యాలను నిరంతరంగా వినియోగించుకునే అవకాశం కల్పించబడింది. ఈ కేసు తదుపరి విచారణతో పాటు తుది వాదనల ప్రారంభం కోసం 2026 ఆగస్టు 25కు వాయిదా వేయబడింది.

# జీడిగడ్డ తండా అంగన్వాడి టీచర్ సరోజన ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**-వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం**



ఆగస్టు 4 నవ సంఘర్షణ
ఉప్పరపల్లి గ్రామ శివారు జీడిగడ్డ తండాలో అంగన్వాడీ టీచర్ సరోజన ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ సరోజన మాట్లాడుతూ ముర్రు పాలు మరియు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది. శిశువు పుట్టిన గంటలోపే పిల్లలకు ముర్రు పాలు తప్పకుండా తాగించాలని ఆ పాలలో అనేకమైన పోషక పదార్థాలు ఉంటాయని తద్వారా రోగనిరోధక శక్తి కలిగి ఉంటారని తెలిపారు. పుట్టిన శిశువుకు ఆరు నెలల వరకు తల్లిపాలనే ఇవ్వాలని ఆ తర్వాత అనుబంధ ఆహారము ఇవ్వాలన్నారు. మహిళలు గర్భిణిగా ఉన్నప్పుడు ఆకుకూరలు పండ్లు ఫలాలు కలిగిన పోషకపదార్థాల ఆహారం బలంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ అంగన్వాడి ఆయా కమలమ్మ గ్రామ పెద్దలు లక్ష్మి, తార్కి తల్లులు నునావత్ శివాని, లైలా, రజిత తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# బడి బాగుపడేదెలా?




సమాజానికి కళ్ళు, కాళ్ళు అయిన ప్రభుత్వ బడికి పట్టిన గ్రహణం వీడేదెట్లా? ఇప్పుడు ఇదే ప్రశ్న దేశ ప్రజలను తొలిచేస్తున్న అంశం. ప్రభుత్వ బడులు, ప్రైవేటు బడుల్లో కూడా క్రమంగా నమోదు పడిపోతుంది. ప్రభుత్వ బడిలో ఈ పరిణామం మరింత వేగంగా కొనసాగుతుంది. ఇటీవల కేంద్రం విడుదల చేసిన గణాంకాలననుసరించి రోజుకు 25 పాఠశాలల చొప్పున గడిచిన 10ఏళ్ళలో 94వేల పాఠశాలలు మూతపడ్డాయి. మొత్తంమీద 2.26 కోట్ల మంది విద్యార్థుల నమోదు తగ్గింది. మన రాష్ట్రం కూడా బడులమూతలో అగ్రస్థానంలోనే ఉంది. పార్లమెంటులో ప్రకటించిన గణాంకాలు ననుసరించి గత ఏడాది 1920 పాఠశాలలు రాష్ట్రంలో మూతపడ్డాయి. అందులో 1400 ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలే! అంతేకాదు పాఠశాలల మూత, నమోదు క్షీణతలో మనం దేశంలోనే రెండవ స్థానంలో నిలిచాము. ఇంకా ఒకటి రెండు సంవత్సరాలలో 10వేల ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలు పాఠశాల క్రమబద్ధీకరణ జిఒ 25, 2021 ప్రకారం పదిమంది కంటే తక్కువ పిల్లల నమోదు ప్రాథమిక పాఠశాలలో ఉంటే సమీప పాఠశాలల్లో విలీనం కానున్నాయి. అంటే చాలామంది బడి ఈడు పిల్లలకు పాఠశాల యాక్సెస్ తగ్గిపోతుంది. ఈ పరిస్థితికి కారణం ఏమిటి? అనేది నేడు సమాజం ముందు ఉన్న ప్రశ్న. నమోదు పడిపోవడానికి ప్రధాన కారణం 1) సంతానోత్పత్తి తగ్గిపోవడం: అంటే చాలా ఆలస్యం అవుతున్న వివాహాలు మూలంగా సంతానోత్పత్తి (ఫెర్టిలిటీ) శాతం పడిపోతుంది. అంతేకాదు, స్త్రీ పురుష నిష్పత్తిలో వచ్చిన వైవిధ్యం వల్ల చాలా మంది యువత పెళ్ళికాని ప్రసాదులుగా మిగిలిపోతున్నారు. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అయి ఏకాకులు అవుతున్న స్థితి కనిపిస్తుంది. 2) పెరిగిన వలసలు: ఇప్పటికే యువత సుమారు 5 కోట్లమంది వివిధ దేశాలకు మేధో, శ్రామిక వలసగా వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. ఫలితంగా వారిపిల్లలకు అక్కడే మెరుగైన విద్య లభిస్తుందనే భావన ఉండడం వలన అక్కడే స్థిరపడుతున్నారు. గ్రామీణ ప్రాంతం నుండి కూడా వలసలు పెరగడం మూలంగా 20 శాతం గృహాలు పడావుపడి, తాళం కప్పలు వేలాడుతున్నాయి. ఈ సంఖ్య మరింత పెరిగితే గ్రామీణ వ్యవస్థలో అసహజ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. 3) గ్లోబల్ మార్పులు: ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు మూలంగా పట్టణీకరణ పెరిగింది.అంతేకాదు విద్య, అవసరాలు, విధానాల్లో వచ్చిన మార్పుల్ని ప్రైవేటు విద్యా వ్యవస్థ అందుకున్నంతగా ప్రభుత్వ వ్యవస్థ అందుకోలేక సాంప్రదాయ బోధనకు పరిమితం అయింది. ఆంగ్ల మాధ్యమం, కంప్యూటర్ శిక్షణ ఇత్యాది ఆధునిక మార్పులు ఆలస్యంగా ప్రభుత్వ పాఠశాల గమనించడం వలన నష్టం జరిగింది. 4) ప్రభుత్వ అనాలోచిత విధానాలు: వీటికి తోడు వివిధ ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు అన్నింటికంటే ఎక్కువగా ప్రభుత్వ విద్యా రంగం దెబ్బ తినడానికి కారణం అయింది. విద్యా బాధ్యతల నుండి వైదొలగే ప్రయత్నంలో భాగంగా పరోక్షంగా ప్రైవేటు విద్యా వ్యవస్థను ప్రోత్సహించారు. అభివృద్ధికి ప్రధాన సూచిక అయిన ప్రభుత్వ విద్యకు బడ్జెట్లో కేటాయింపులు తగ్గిస్తూ వచ్చారు. ఉదాహరణకు తెలంగాణలో రెండు లక్షల పైచిలుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య లక్షకు పడిపోయింది. పాలకులు కూడా ఉన్న పాఠశాలల సంస్కరణ కాకుండా తమ ముద్రకోసం ఇష్టంవచ్చిన రీతిగా వివిధ పేర్లతో కొత్త పాఠశాలలు నిర్మించి కోట్లాది రూపాయల ప్రజాధనం హెచ్చిస్తున్నారు. ఒకే హ్యాబిటేషన్‌లో ఒకే పాఠశాల ఉండాల్సి ఉండగా అందుకు భిన్నంగా అనేక ప్రభుత్వ బడులు, అదుపు లేకుండా ప్రైవేటు పాఠశాలలు ఏర్పడ్డాయి. ఫలితంగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు దారుణంగా పడిపోయింది. ఎలక్ట్రానిక్ హాజరు విధానం వచ్చిన తర్వాత, ఆధార్ అనుసంధానం తర్వాత వివిధ పాఠశాలల్లో విద్యార్థుల హాజరులో పారదర్శకత చోటు చేసుకుంది. కనుక నమోదులో అవకతవకలు చూపడం కూడా సాధ్యం కాని స్థితి ఏర్పడింది. ఇప్పటికీ ప్రభుత్వ బడుల్లో సరైన సౌకర్యాలు లేవు. 5) సామాజిక సహకారం: లోపించిన సహకార భావం కూడా పాఠశాల అభివృద్ధికి ప్రధాన ఆటంకంగా మారింది. గతంలో గ్రామీణ, పట్టణ ప్రాంత రాజకీయ నాయకులు భూదానాలు, భూరి విరాళాలతో విద్యా వ్యవస్థకు సహకరించే వారు. ప్రభుత్వం నుంచి అభివృద్ధిలో కూడా విద్యా ప్రాధాన్యత ప్రధానాంశంగా ఉండేది. ప్రస్తుతం వారి ప్రాధాన్యత గుడులు, గోపురాలు, చర్చి, మసీదుల నిర్మాణం వైపు మళ్ళింది. ప్రజల దృష్టి కూడా ఆదిశగానే మళ్ళింది. ప్రభుత్వ పాఠశాల సమాజం నుండి దూరంగా జరుగుతున్న వాతావరణం కనిపిస్తుంది. ఇప్పటికే తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక ననుసరించి రాష్ట్రంలోని 19 వేల ప్రాథమిక పాఠశాలల్లో 13 వేల ప్రాథమిక పాఠశాలలు 50 కంటే తక్కువ విద్యార్థుల నమోదు ఉంది. 5600 ఉన్నత పాఠశాలల్లో రాష్ట్రవ్యాప్తంగా 500 ఉన్నత పాఠశాలలు ఇప్పటికే మూతపడగా మరో మూడొంతులు పాఠశాలలు 50 కంటే తక్కువ సంఖ్యలో పిల్లల నమోదు ఉంది. తెలంగాణసమాచారం ఒక్కో పాఠశాలకు 8మంది బోధనా సిబ్బంది, ముగ్గురు బోధనేతర సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వ బడిమూత ప్రైవేటు పాఠశాల వ్యవస్థకు వరంగా మారకూడదు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు పెరగాలన్నా, ప్రభుత్వ బడిని కాపాడుకోవాలన్నా ప్రస్తుతం సామాజిక భాగస్వామ్యం, సహకారం పాత్ర కూడా ప్రధానమైనదే. ఉన్నప్రభుత్వ బడుల ఆస్తులు సద్వినియోగం అయ్యేలా పాఠశాల సంస్కరణ అవసరం.విద్యానంతర జీవితానికి మార్గదర్శకంగా ఉండే విద్యా పునాదులు అవసరం.విద్యా ప్రజాస్వామీకరణ దిశగా క్రమంగా కామన్ స్కూల్ విధానం వైపు సంస్కరణ ఉండాల్సిందే. ప్రభుత్వ బడులు ఉనికి నిలబడాలంటే నిలకడైన నమోదు శాంతంతోపాటు, ఆధునిక సవాళ్ళు అధిగమించే విద్య ప్రభుత్వ బడుల్లో అందుబాటులోకి తేవడం అత్యవసరం. ఆ దిశగా చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరగాలి.

# వచ్చే ఎన్నికల్లో జెన్‌జెడ్‌దే కీలక పాత్ర



జెన్‌జెడ్ యువత ఉద్యమం ఇప్పుడు ప్రభుత్వాన్నే కాదు, ప్రతిపక్షాలకు కూడా సవాలుగా మారింది. ఏ ఒక్క రాజకీయ పార్టీకి మద్దతు ఇచ్చే ఉద్యమం కాదు ఇది. వీరంతా పరిస్థితుల బట్టి, సమస్యల తీవ్రత బట్టి తమ ఓట్ల శక్తిని మార్చుకునే 'ఫ్లోటింగ్ ఓటర్లు'. అందువల్ల 2029 ఎన్నికల్లో వీరి ఓటు నిర్ణయం కీలక పాత్ర వహించే అవకాశం కనిపిస్తోంది. నీట్ పరీక్షల ప్రశ్నాపత్రం లీకేజీపై ఉధృతంగా సాగిన వీరి నిరసనలతో కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఆ తరువాత వీరి డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించడం తదితర పరిణామాల ఫలితంగా వీరి నిరసనలు ముగిసినా, వీరి అసలు ప్రభావం రానున్న ఎన్నికల్లో తెలుస్తుంది. ఈ ఉద్యమం చాలా మంది యువ ఓటర్లను చైతన్యపర్చింది. ఎన్నికల్లో వీరు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ఇక ప్రతిపక్షాల సంగతి పరిశీలిస్తే కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలను వారు ప్రభుత్వంపై పెల్లుబికిన అసంతృప్తిగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రజాగ్రహాన్ని రానున్న ఎన్నికల్లో తమకు ఓటుబ్యాంకుగా మార్చుకోవచ్చని ఆశపడుతున్నారు. వీరి అంచనా తప్పు కాకపోయినా అది అసంపూర్తి అని చెప్పవచ్చు. ప్రజలు ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉండవచ్చు. కానీ అదే సమయంలో ప్రతిపక్షంపై కూడా ప్రజలకు పూర్తి నమ్మకం ఉందా? అన్నదే ప్రశ్న. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజావ్యతిరేకత రాజకీయంగా రూపాంతరం ఎలా చెందుతుందో నిర్ణయించేది ప్రతిపక్షం చూపించే ప్రత్యామ్నాయం, విశ్వసనీయత, నాయకత్వం, స్పష్టమైన కార్యాచరణే. నిజానికి ఒక నాయకుడు అంటూ లేకుండా, స్పష్టమైన సంస్థాగత నిర్మాణం లేకుండా, ప్రతిపక్షాలన్నింటి కంటే ముందుగా ప్రజాగ్రహాన్ని అందిపుచ్చుకుని కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది. మరి ప్రధాన విపక్షాలు ఏం చేయగలిగాయి? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల నిరసనలను సమీకరించి రాజకీయ సమీకరణాన్ని పూర్తిగా గేమ్‌ఛేంజర్‌గా వ్యూహాన్ని కాక్రోచ్ జనతా పార్టీ రూపొందించగలిగింది.

మరి విపక్షం ఇలాంటి వ్యూహాన్ని రూపొందించగలదా? లేక సంప్రదాయ రాజకీయాలకే పరిమితమైపోతుందా? అలాగని ప్రతిపక్షాలు విజయాలు సాధించలేదని అనలేం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఇండియా కూటమి మొత్తం 80 స్థానాల్లో 43 స్థానాలను గెలుచుకుని రికార్డు సాధించింది. బిజెపి 'అబ్ కి బార్ 400 పార్' అన్న నినాదంతో ముందుకు వెళ్లగా, ఆ విధంగా 400 సీట్లు బిజెపికి వస్తే రాజ్యాంగాన్ని మార్చి వేస్తుందని ఇండియా కూటమి విస్తృతంగా ప్రచారం సాగించి ప్రజల్లో బిజెపిపై అపనమ్మకాన్ని పెంచి గెలుపు సాధించింది. అయితే 2029 ఎన్నికల నాటికి పరిస్థితి ఇలా ఉండదు. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ తన వ్యూహాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా జెన్‌జెడ్ యువతను చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను కొత్తగా తెరపైకి తెస్తున్నారు. లోక్‌సభలోని మొత్తం 543 స్థానాలను 850 వరకు పెంచడానికి ప్రయత్నిస్తున్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుతోపాటు లోక్‌సభ స్థానాల్లో మూడోవంతు సీట్లను వారికే కేటాయించడానికి యోచిస్తున్నారు. 2011 జనాభా ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజన చేస్తున్నారు. ఈ ప్రణాళిక అమలైతే 2029 ఎన్నికలకు ముందే భారత పార్లమెంటరీ వ్యవస్థలో దశాబ్దాల తర్వాత అతిపెద్ద మార్పు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలకు ఇప్పుడు గెలుచుకోవలసిన కీలక వర్గం జెన్‌జీ యువ ఓటర్లే. వీరు ఏ పార్టీకి శాశ్వతంగా కట్టుబడని ఓటర్లు అన్నసంగతి తెలిసిందే. భారతీయ కుటుంబాలు సంప్రదాయంగా ఒకే విధమైన రాజకీయ అభిప్రాయాలను కలిగి ఉండగా, జెన్‌జీ ఓటర్లు అభిప్రాయాలు మాత్రం వారికి భిన్నంగా ఉంటున్నాయి. వీరు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలు, ఇంటర్నెట్, ఇన్‌స్టాగ్రామ్‌ల వంటి సమాచార సాధనాలతో మమేకం అవుతున్నారు. అందువల్ల తమ తల్లిదండ్రుల అభిప్రాయాలకు దూరంగా ఆలోచిస్తున్నారు. 2029 నాటికి దేశంలో జెనరేషన్ జెడ్ అతిపెద్ద ఓటరు వర్గంగా మారుతుంది. అప్పటివరకు మిలీనియన్స్‌ను అధిగమించి అత్యంత శక్తివంతమైన వర్గంగా జెన్‌జీ నిలుస్తుంది. ఇంకా ముఖ్యమైన విషయం ఏమిటంటే 2029లో సుమారు 5 కోట్ల నుంచి 6 కోట్ల వరకు భారత యువత తొలిసారిగా ఓటు వేయబోతున్నారు. ఈ కొత్త ఓటర్ల వర్గం అనేక దేశాల మొత్తం జనాభా కన్నా ఎక్కువే. ఈ యువత ఏ ఒక్క పార్టీకి అనుకూలంగా లేదు. ఉద్యోగ సమస్యలు, పరీక్షల్లో అవకతవకలు, కృత్రిమ మేధ వ్యాప్తితో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లడం, తదితర సమస్యలు వీరిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. అందుకనే ఏ రాజకీయ పార్టీ వచ్చినా తమ బతుకులింతే అన్న అసంతృప్తి వీరిలో నాటుకుపోయింది. జెన్‌జీ యువతలో కొందరు తమ ఉద్యమంతో ప్రభుత్వం దిగివచ్చి కేంద్ర విద్యామంత్రిని రాజీనామా చేయించిందని, మిగతా డిమాండ్లకు సానుకూలంగా స్పందించిందని, అందుకని తమ సమస్యలను పరిష్కరించగలదన్న ఆశతో ఉండగా మరికొందరు జంతర్ మంతర్‌లో నిరసనల సమయంలో, పార్లమెంట్ మార్చ్‌లో పోలీసులు తమపై సాగించిన దారుణ దమనకాండను గుర్తు తెచ్చుకుంటున్నారు. మేకులు తాపిన లాఠీలతో చితక బాదారని, బాష్పవాయు ప్రయోగించారని, ఇంటర్నెట్ నిలిపివేశారని, ఏమాత్రం విశ్వసత లేని ప్రచారాలు సాగించారని మండిపడుతున్నారు. మరికొంతమంది రాజకీయ నాయకులు అవకాశవాద వైఖరిని అసహ్యించుకుంటున్నారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు కనిపించి, పరిస్థితులు కష్టంగా ఉన్నప్పుడు అదృశ్యమైన ఊసరవెల్లి నాయకుల తీరును ఎండగడుతున్నారు. ఈ చేదు అనుభవాలతో యువత ఎవరికి ఓటు వేయడానికి మొగ్గు చూపుతారో చెప్పలేం.

# బిజెపి ఆత్మపరిశీలనకు ఇదే సమయం !




కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మేల్కోవాల్సిన సమయం వచ్చింది. ఇక్కడ బిజెపి అంటే మోడీ, అమిత్ షా మాత్రమే అని చెప్పుకోవాలి. ఎందుకంటే అధకారంలోనూ, పార్టీలోనూ ఈ ఇద్దరిదే పెత్తనం కనుక వీరిద్దరు మేల్కొంటే బిజెపి మేల్కొన్నట్లుగానే చూడాలి. ఎందుకంటే బిజెపి పాలనలో ప్రజల పట్ల మెల్లగా వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. వీటిని ఆ ఇద్దరు ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ఉప ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో బిజెపి కేవలం గుజరాత్‌లో ఒక్కసీటు మాత్రమే గెల్చుకోలిగింది. బీహార్, మధ్యప్రదేశ్‌లలో అధికారంలో ఉన్నా, అక్కడ గెలవలేదు. సాధారణంగా అధికారంలో ఉన్నచోట ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులే గెలుస్తారు. కానీ అనూహ్యంగా బిజెపి పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత కనబర్చారు. మొన్నటికి మొన్న నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు గళమెత్తారు. విద్యార్థుల పార్లమెంటు ముట్టడి గర్జనకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే చేయక తప్పని పరిస్థితి వచ్చింది. ఇది తమ ఎత్తుగడే అని బిజెపి నేతలు సమర్థించుకున్నా అంతిమంగా విజయం విద్యార్థుల వైపే ఉంది. తాము ఎన్నుకున్న ప్రభుత్వాలే తమ భవిష్యత్తును నట్టేట ముంచుతుంటే ఓపిక, సహనం నశించి తీవ్రమైన ఆవేదన, ఆవేశం, ఆక్రోశంతో యువత రగిలి చేసిన పోరాటంగా దీనిని చూడాలి. ప్రారంభంలో విద్యార్థుల పోరాటాన్ని బేఖాతరు చేసిన ప్రధాన మీడియా చానెళ్లు కూడా తదనంతరం తప్పనిసరి పరిస్థితుల్లో మేల్కొన్నాయి. వారి పోరాటాన్ని గుర్తించక తప్పలేదు. ఈ పోరాటం వెనక ఎవరు ఉన్నారన్నది తెలుసుకుంటూనే, విద్యార్థుల్లో ముఖ్యంగా యువతలో నిద్రాణంగా ఉన్న ఆక్రోశాన్ని కూడా గుర్తించాలి. అందుకే బిజెపి నేతలు విదేశీ హస్తం ఉంటే గుర్తించి చర్యలు తీసుకోవడం ఒక ఎత్తయితే..యువతలో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆందోళనలను కూడా గుర్తించాలి. విద్యార్థులు చేసిన ఏ ఉద్యమం కూడా విఫలమైనట్టు ప్రపంచ చరిత్రలో లేదు. అది వివిధ దేశాల స్వాతంత్ర్య ఉద్యమాల నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు ఇప్పుడు కాక్రోచ్‌ల ఉద్యమం వరకు రుజువైంది. విద్యార్థులు, యువతతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలూ, పార్టీలూ మనుగడ సాగించలేవు. ఎంతటి బలమైన నియంతృత్వ ప్రభుత్వమైనా విద్యార్థుల పోరాటానికి తారుమారైన చరిత్ర ఉంది. విద్యార్థులే కదా అని అలుసుగా తీసుకుంటే అధికారం గల్లంతవుతుంది. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, ఇతర ఆఫ్రికా దేశాల్లో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలను చూసిన తరవాత మనం కూడా జాగ్రత్త పడాలి. అలాంటి పరిస్థితి ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో భవిష్యత్తులో రాకుండా ఉండాలంటే సమస్యలను పక్షపాత ధోరణితో సాగదీయకుండా పాలకులు, ప్రభుత్వాలు పరిష్కరించాలి. అధికారం శాశ్వతం అనుకుంటే... వారి రాజకీయ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుంది. భవిష్యత్తులో ఇంతకంటే తీవ్ర స్థాయిలో విద్య, ఉద్యోగ, రాజకీయంగా అణచివేయబడ్డ అనేక సామాజిక వర్గాల నుంచి ప్రతిఘటనలు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తించాలి. ఇకపోతే ఇదొక్కటే అనుకుంటే పొరపాటు. ఎన్నికల్లో కూడా ప్రజలు మెల్లగా మోడీ పాలనపై వ్యతిరేకత వ్యక్త పరుస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని 242 సీట్లకు పరిమితం చేశారు. ఇదే మొదటి హెచ్చరిక. ఇక ఇప్పుడు తాజా ఉప ఎన్నికల ఫలితాలు మరో హెచ్చరికగా చూడాలి. చాపకింద నీరులా ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గుర్తించాలి. పాలనలో మూస పద్ధతి నుంచి బయటపడాలి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పన్నులు వంటివి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఆస్పత్రులు, విద్యారంగం మరీ దిగజారి పోతున్నాయి. సమాజంలో ప్రతి ఒక్క రంగం జనాలను జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నాయి. వీటిని తక్షణం సమీక్షించుకోక పోతే ఇది పెను ఉప్పెనలా విరుచుకు పడడం ఖాయం. ఎందుకంటే ఉప ఎన్నికలు, విద్యార్థుల ఆందోళనలను బిజెపి నేతలు సీరియస్‌గా తీసుకుని సమీక్షించుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఇది. బిహార్‌లోని బాంకీపూర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ విజయం రాష్ట్ర, దేశ రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఉప ఎన్నికలో ఆయన నీరజ్‌కుమార్ సిన్హా అనే బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించి ఉండవచ్చు. కానీ, నిజానికి ఆయన ఓడించింది బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌నే అని గుర్తించాలి. ఒక్క నితిన్‌నే కాదు మోడీ, అమిత్ షాలను అని కూడా గుర్తించాలి. పదిహేనేళ్ళ క్రితం వరకూ పాట్నా వెస్ట్‌గా ఉన్న ఈ అర్బన్ అసెంబ్లీ స్థానాన్ని వరుసగా ఐదుసార్లు ఘనంగా నెగ్గుకొచ్చిన నితిన్ నబీన్ రాజ్యసభకు తరలడంతో ఈ ఉపఎన్నిక అనివార్యం అయ్యింది. దీనికితోడు, బీజేపీ అధ్యక్షుడి కంటే ముందు ఆయన తండ్రి కిశోర్ ప్రసాద్‌సిన్హా సైతం ఏకబిగిన పలుమార్లు గెలుచుకున్నస్థానం కావడంతో ఈ శాసనసభ ఉపఎన్నిక ఫలితం యావత్ దేశాన్ని ఆకర్షించింది. బిహార్‌లో సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని తొలి బీజేపీ ప్రభుత్వానికి ఎదురైన తొలి ఎన్నికల పరీక్ష ఇది. కాయస్థ, భూమిహార్, రాజ్‌పుట్ ఇత్యాది అగ్రకులాల సంఖ్యాబలం గణనీయంగా ఉన్న ఈ స్థానం చేజారిపోవడం కచ్చితంగా ఆ పార్టీ పెద్దలకు ఆందోళన కలిగించే అంశం. గత ఏడాది ఎన్నికల్లో ఆర్జేడీ అభ్యర్థిపై నితిన్ నబీన్ యాభైవేల మెజారిటీతో గెలిచారన్నది దృష్టిలో ఉంచుకుంటే ఇప్పటి పరాజయం తీవ్రత అర్థమవుతుంది. నీట్ పరీక్షలో అవకతవకలు, పిల్లల ఆత్మహత్యలు, ఉధృతంగా సాగిన జెన్‌జీ ఉద్యమం, ఉద్యోగ ఉపాధి అవకాశాల లేమి వంటివి ఈ ఫలితాలను ప్రభావితం చేశాయని చెప్పకతప్పదు. బీజేపీకి గుణపాఠం నేర్పాలన్న లక్ష్యంతో యువతతో పాటు, వారి మనోభావాలకు అనుగుణంగా మధ్యవయసువారు, వృద్ధులు కూడా ఓట్లేశారని, అన్ని కులాలవారు, రంగాలవారు ఏకరీతిన నడిచారని విశ్లేషణలు చెబుతున్నాయి. దేశంలో ప్రతిపక్షపార్టీలు బలహీనంగా ఉండవచ్చు, కానీ, ప్రతిపక్ష స్థానం మాత్రం బలంగానే ఉంది అంటూ పీకే చేసిన వ్యాఖ్యను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఇవి కొన్ని హెచ్చరికలు మాత్రమే. అలాగే ఆత్మపరిశీలన చేసుకోవడానికి వచ్చిన అవకాశంగా బిజెపిలోని మిత్రద్వయం గుర్తించాల్సన సమయమిది. దేశంలో పాలన బాగుందని తమకు తాము భుజాలు ఎగరేసుకుంటే సరికాదు. ప్రజలు ఏమనుకుంటున్నారో అన్నది తెలుసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా విద్యార్థుల కోణంలో విద్యారంగంలో గణనీయమైన మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఉపాధి, ఉద్యోగ రంగాల్లో మార్పులను తీసుకుని రావాలి. యువత వీటికోసం ఎదురు చూస్తోంది. పన్నులు, ధరలు, విద్యారంగ దోపిడీ, వైద్యరంగంలో దోపిడీ గురించి సామాన్య ప్రజలు సైతం ఆగ్రహంగా ఉన్నారు. ఇవన్నీ కూడా పరిష్కరించగలిగినవే. రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులతో ప్రజలకు పాలనను చేరువ చేయగలిగే సమర్థతను ప్రదర్శించగలిగిన్పుడే బిజెపి మనుగడ కొనసాగుతుంది.

# ఇచ్చిన మాట ప్రకారం మంత్రి వెంకటరెడ్డి రెండు నెలలలో ఆసుపత్రి నూతన భవనం నిర్మించాలి

**-ప్రభుత్వ వైద్యాన్ని మరిచి ప్రైవేటు ఆసుపత్రులకు మొగ్గు**
**-చూపుతున్న ప్రభుత్వ డాక్టర్లు**
**-రామన్నపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కనీస వైద్యం అందని తీరు అందుబాటులో లేని వైద్యులు పట్టించుకోని ప్రభుత్వ పెద్దలు**
**-మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**





రామన్నపేట ఆగస్టు 4 నవ సంఘర్షణ

యాదాద్రి భువనగిరి జిల్లారామన్నపేట మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరిశీలించి రోగులకు అందుతున్న సేవలు గురించి తెలుసుకొని ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉంటలేరని ప్రతిరోజు నలుగురు డాక్టర్లు ఉండాలి కానీ ఒక్క డాక్టర్ మాత్రమే విధుల్లో ఉండడం జరిగింది ఉదయం ఓపీ సమయంలో మాత్రమే నాలుగు గంటలు ఉండి తర్వాత వారి యొక్క ప్రైవేట్ క్లినిక్ లకు వెళ్లి వైద్యం చేస్తున్నారు దానివల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందక వచ్చిన రోగులను నల్గొండ హైదరాబాద్ ఆసుపత్రికి పంపించడం జరుగుతుంది పాము కరిసిన కుక్క కరిసిన గర్భిణీ స్త్రీలను కూడా మందులు లేవని సరైన సదుపాయాలు లేవని నల్గొండ హైదరాబాద్ ఆసుపత్రికి పంపి ఇవ్వడం జరుగుతుంది గత ప్రభుత్వంలో ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల వసతులు కల్పించి డాక్టర్లను ఉంచి గర్భిణీ స్త్రీలకు ఇక్కడే డెలివరీలు చేసి కెసిఆర్ కిట్ ఇచ్చి న్యూట్రిషన్ కిట్టు వారికి ప్రభుత్వం నుంచి13000 ఆర్థిక సాయం చేసి వారి ఇంటి దగ్గరకు తీసుకెళ్లి దించి వేయడం జరిగేది గత ప్రభుత్వంలో 11 కోట్లతో ఆసుపత్రి నూతన భవనమునకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ ప్రభుత్వము వచ్చి 33 నెలలైనా ఇప్పటివరకు ఆస్పత్రి మీద ప్రజల మీద ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టి పెట్టడం లేదు ఈ మధ్యనే ఈ జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రామన్నపేటకు వచ్చి మూడు నెలల్లో ఆసుపత్రి భవనాలను పూర్తిచేసి ఆ ఫోటోలను హరీష్ రావుకు పంపిస్తానని చెప్పడం జరిగింది చెప్పిన మాటలకు ఇప్పటికే ఒక నెల పూర్తయింది ఇచ్చిన మాట ప్రకారం ఇంకో రెండు నెలల్లో ఆసుపత్రి భవనాలు పూర్తిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సాయం అందించాలని మంత్రి ని కోరడం జరిగింది, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, పోషబోయిన మల్లేశం, బిఆర్ఎస్ సర్పంచులు, కునూరు సాయికుమార్ గౌడ్, కంభంపాటి శ్రీనివాస్ గౌడ్, పులిపలుపుల వీరస్వామి గౌడ్ ,ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్,మండల మాజీ కోఆప్షన్ ఎండి అమీర్, జిల్లా నాయకులు ఎస్కే చాంద్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ కుమార్, సీనియర్ నాయకులు, బత్తుల వెంకటేశం, బొడ్డు ఆల్లయ్య, గుండాల రాంబాబు, ఆవుల శ్రీధర్, జాల అమరేందర్ రెడ్డి ,కర్రె శ్రీను, ఎండి ఆరిఫ్, పోష బోయినభద్రయ్య, యాదగిరి, కుమార్ ,తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చాంబర్లో కలిసి ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై చర్చించిన కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**- వారం రోజుల్లో మునుగోడు నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రుల**
**-అభివృద్ధికి సంబంధించిన నివేదిక ఇవ్వాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నత**
**-అధికారులను ఆదేశించిన మంత్రి దామోదర రాజనర్సింహ**





చండూరు ఆగస్టు 4 నవ సంఘర్షణ

మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా సబ్ సెంటర్లు,పీహెచ్సీలు, సిహెచ్సిలు,ఏరియా ఆసుపత్రులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు, సిబ్బంది, సాంకేతిక పరికరాలు, కావలసిన నిధులకు సంబంధించిన వివరాలతో పాటు చేయాల్సిన అభివృద్ధి పై ఈరోజు హైదరాబాదులోని సెక్రటేరియట్లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు రాజ్ గోపాల్ రెడ్డి, ఈ సమావేశంలో మునుగోడు, నాంపల్లి, పిహెచ్సిల ఆధునీకరణతోపాటు 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం, మర్రిగూడ సిహెచ్సి ని 30 పడకల నుండి 50 పడకలకు పెంచడం సిబ్బంది నియామకం సాంకేతిక పరికరాల కల్పన పోస్టుమార్టం ఎగ్జామిన్ రూమ్,, చండూరు రెవిన్యూ కేంద్రంలో వంద పడకలతో ఏరియా ఆసుపత్రి మంజూరు నిర్మాణం, గట్టుపల్ పిహెచ్సికి సిబ్బంది నియామకం సాంకేతిక పరికరాల కల్పన, జాతీయ రహదారి 65 పై ప్రమాదాలు జరిగినప్పుడు గోల్డెన్ హావర్లో హైదరాబాదు తీసుకెళ్లలేకపోతున్నారని ఈలోపే చాలామంది మరణిస్తున్నారని.. చౌటుప్పల్ ప్రాంతంలో అత్యవసర చికిత్స కోసం ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు,ట్రామా కేర్ సెంటర్ తో పాటు చౌటుప్పల్లో వంద పడకల ఏరియా ఆసుపత్రి ఆధునీకరణ సాంకేతిక పరికరాల కల్పనలి తో అభివృద్ధి చేయాలని కోరారు..

ప్రస్తుతం గ్రామాలలో నిర్మించే ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాల బడ్జెట్ మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న ధరలు, అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సరిపోవడం లేదని సబ్ సెంటర్లతో పాటు పిహెచ్సిలు,సిహెచ్సీ లు, ఏరియా ఆసుపత్రుల బడ్జెట్ పెంపు విషయం పై కూడా చర్చించారు. ఎమ్మెల్యే ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి చేయాలనీ చెప్పిన విషయాలన్నింటిని మంత్రి దామోదర రాజనర్సింహ నోట్ చేసుకొని మునుగోడు నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి హామీ ఇచ్చారు.. వెంటనే వారం రోజుల్లో మునుగోడు నియోజకవర్గ ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి సంబంధించిన నివేదిక తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు...

చౌటుప్పల్ ఏరియా హాస్పిటల్ నిర్మాణ పనులను ఈ నెల చివరికల్లా పూర్తి చేయాలని, సెప్టెంబర్లో హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మునుగోడు నియోజకవర్గంలోని ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్షించారు.

చౌటుప్పల్లో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్,,ట్రామా కేర్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. నియోజకవర్గంలోని హాస్పిటళ్లు అన్నింటినీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తో పాటు ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవిందర్ నాయక్, నల్గొండ జిల్లా డీఎంహెచ్, డాక్టర్ రాహుల్,డి సి హెచ్ మాత్రు నాయక్, యాదాద్రి భువనగిరి జిల్లా డి ఎం హెచ్ ఓ మనోహర్, డి సి హెచ్ సూర్య శ్రీ లు పాల్గొన్నారు.

# నిత్యవసర సరుకుల పంపిణి



మందమర్రి ఆగస్టు 4 నవ సంఘర్షణ

పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ నివాసి సుర శారద కుమారుడు వంశీ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి తనవంతు సాయంగా శారద కుటుంబానికి మంగళవారం నిత్యవసర సరుకులను పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు వడ్లూరి సునీల్,మూడారపు శేఖర్,రాయబారపు కిరణ్,ఎం.డి జావీద్ ఖాన్ ,ప్రదీప్, రిత్విక్, పచ్చిక మహేందర్, సతీష్, మహేందర్, భరత్, రహీం ,వెంకటేశ్, కిరణ్ పాల్గొన్నారు.

# మాన్సూరాబాద్ నందు భారాస పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం



మాన్సూరబాద్ ఆగస్టు 4 నవ సంఘర్షణ

అనంతరం మన్సూరాబాద్ డివిజన్ యువ నాయకులు.జక్కిడి రఘువీర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి. మన్సూరాబాద్ డివిజన్ యువ నాయకులు శ్రీ జక్కిడి రఘువీర్ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా విజయశ్రీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన భారాస పార్టీ కార్యాలయాన్ని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు ప్రారంభించారు. అనంతరం జన్మదిన వేడుకల్లో పాల్గొని రఘువీర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి యువ నాయకులు అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు .కార్యక్రమంలో సీనియర్ భారస పార్టీ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉచిత యోగ శిక్షణా తరగతులు



చిట్యాల ఆగస్టు 4 నవ సంఘర్షణ

చిట్యాల లో ఆగస్టు 6వ తేదీ నుండి సంకల్ప క్రియ యోగ ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించబడునని సంకల్ప క్రియా సాధకులు బూరుగు కృష్ణయ్య, కంచర్ల ఈశ్వరయ్య,కాచం రమేష్ తెలిపారు. చిట్యాల లోని ధ్యాన మందిరం లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. యోగాసనాలతో అనారోగ్యా సమస్యలు తొలగి మార్పులతో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. స్థానిక భువనగిరి రోడ్ లోని లక్ష్మి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ 6 వ తేది సాయంకాలం 6గంటలకు పరిచయ కార్యక్రమం తో శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయాన్నారు, మరుసటి రోజు నుండి ఉదయం 5 గంటల నుండి 7 వరకు, సాయంకాలం 6 గంటల నుండి 8 గంటల వరకు ఉచిత యోగ శిక్షణ జరునని తెలిపారు. శిక్షణ కు ప్రతి ఒక్కరు హాజరై ఆరోగ్యావంతులుగా కావడం, ఆరోగ్యం ను మెరుగుపరచుకోవాలన్నారు. కార్యక్రమం లో రేగొండ వేణుమాధవ్, మాస శ్రీనివాస్, గాదె ఎల్లేష్, నీలా సత్యనారాయణ, పోలా సరోజ సాధకులు పాల్గొన్నారు.

# నిత్యవసర సరుకుల పంపిణి

మందమర్రి ఆగస్టు 4 నవ సంఘర్షణ

పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ నివాసి సుర శారద కుమారుడు వంశీ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి తనవంతు సాయంగా శారద కుటుంబానికి మంగళవారం నిత్యవసర సరుకులను పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు వడ్లూరి సునీల్, మూడారపు శేఖర్,రాయబారపు కిరణ్,ఎం.డి జావీద్ ఖాన్ ,ప్రదీప్ ,రిత్విక్, పచ్చిక మహేందర్, సతీష్, మహేందర్, భరత్ ,రహీం, వెంకటేశ్, కిరణ్ పాల్గొన్నారు.



# ఈ20 పెట్రోల్ అమ్మకండి..
# పంజాబ్ అసెంబ్లీలో తీర్మానం

**చండీఘడ్- ఆగస్టు 4 నవ సంఘర్షణ**



దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్ అమ్మకాలపై ఆందోళన వ్యక్తం అవుతున్న విషయం తెలిసిందే. ఇథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల వాహనాలు దెబ్బతింటున్నట్లు కొన్ని చోట్ల ఫిర్యాదులు అందాయి. అయితే దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ ఇవాళ పంజాబ్ అసెంబ్లీలో తీర్మానం పాస్ చేశారు. 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ అమ్మకాన్ని పంజాబ్ అసెంబ్లీ వ్యతిరేకించింది. ఇథనాల్ ఫ్రీ పెట్రోల్‌తో పాటు ఈ20 పెట్రోల్ ఎంపిక చేసుకునే అవకాశం వినియోగదారుడికి ఇవ్వాలని సభలో డిమాండ్ చేశారు. ఈ20 పెట్రోల్‌కు తగినట్లు డిజైన్ లేని వాహనాల్లో దాన్ని వాడడం వల్ల సమస్యలు వస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ20 వాడకం వల్ల వాహనాల్లో మైలేజీ తగ్గుతుంది కాబట్టి, ఆ సామర్థ్యానికి తగినట్లు ఈ20 పెట్రోల్ రిటేల్ ధరను తగ్గించాలని తీర్మానంలో కోరారు. ఆటోమొబైల్ ఇంజినీర్లు, పెట్రోలియం నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, వినియోగదారుల సంఘాలు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో ఓ వ్యక్తిగత కమిటీని ఏర్పాటు చేసి ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై సమగ్రమైన స్టడీ చేయాలని తీర్మానంలో కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సీఎం భగవంత్‌మాన్ సింగ్ సభలో మాట్లాడుతూ సుమారు 45వేల వాహనాలపై ఈ20 ప్రభావం గురించి స్టడీ చేశారని, ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడడం వల్ల వాహనాల్లో మైలేజీ తగ్గినట్లు గుర్తించారని, కొన్ని వాహనాలు పాడైనట్లు కూడా ఆయన చెప్పారు. అసలు ఈ20 విషయంలో ప్రధాని మోదీ ఎందుకు పట్టుపట్టారని, ఇదేమీ నితిన్ గడ్కరీ కుమారుడికి లాభం తెచ్చిపెట్టదని, ఎందుకంటే మోదీకి, ఆయనకు మంచి సంబంధాలు లేవని, కేవలం అమెరికా ప్రభుత్వ వత్తిడి వల్లే ఈ20 పెట్రోల్ అమ్మకాలపై కేంద్రం వత్తిడి తెస్తున్నట్లు భగవంత్ మాన్ ఆరోపించారు. ఇటీవల అమెరికాతో వంద బిలియన్ల డాలర్ల వాణిజ్య ఒప్పందం కుదిరిందని, దానిలో భాగంగా 5 బిలియన్ల లీటర్ల ఇథనాల్ భారత్ కొనుగోలు చేయాల్సి ఉంటుందని భగవంత్‌మాన్ ఆరోపించారు.

## సుప్రీంకోర్టుకు నీట్ అభ్యర్థులు

### ఓఎంఆర్ షీట్స్‌లోని సమాధానాల్లో తేడాలున్నాయంటూ పిటిషన్




**న్యూఢిల్లీ : ఆగస్టు 4 నవ సంఘర్షణ**

ఓఎంఆర్ షీట్స్‌లో అసమానతలు ఉన్నాయంటూ ఆరుగురు నీట్ యూజీ అభ్యర్థులు మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పరీక్ష? సమయంలో ఓఎంఆర్ షీట్స్‌లో వారు మార్క్ చేసిన సమాధానాలకు, నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టీఏ) అప్‌లోడ్ చేసిన కాపీల్లోని సమాధానాల్లో తేడాలు ఉన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రకటనకు ముందే విచారించాలని కోరడంతో..సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట ఈ పిటిషన్ దాఖలైంది. పరీక్ష సమయంలో వారు గుర్తించిన సమాధానాలకు, ఎన్‌టీఏ అప్‌లోడ్ చేసిన ఓఎంఆర్ షీట్లలోని సమాధానాలకు తేడా ఉందని 600, 650కి పైగా మార్కులు సాధించిన ఆరుగురు అభ్యర్థులు పిటిషన్‌లో పేర్కొన్నట్టు న్యాయమూర్తి ధర్మాసనానికి తెలిపారు. ఆ విద్యార్థులు ఎన్‌టీఏకు ఈ మెయిల్ చేయడంతో పాటు, వారి కార్యాలయానికి కూడా వెళ్లారని, కానీ ఎటువంటి స్పందన రాలేదని ఆయన తెలిపారు. దీంతో ఈ పిటిషన్‌ను విచారించేందుకు ధర్మాసనం అంగీకరించింది. ప్రశ్నాపత్రం లీక్ కావడంతో మే 3న జరిగిన నీట్ పరీక్ష?ను ఎన్‌టీఏ రద్దు చేసిన సంగతి తెలిసిందే. జూన్ 21ను తిరిగి నీట్ పరీక్ష?ను నిర్వహించింది.

## ఎయిర్ ఇండియా విమానంలో భారీ కుదుపులు

### 300 అడుగుల మేర కిందికి
### భయంతో వణికిపోయిన ప్రయాణికులు
### 12 మందికి గాయాలు

**న్యూఢిల్లీ ఆగస్టు 4 నవ సంఘర్షణ**



పుకెట్ నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిర్ ఇండియా విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్రయాణ సమయంలో విమానం 300 అడుగుల మేర కిందకు జారిపోవడంతో 12 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఎయిర్ ఇండియాకు చెందిన ఫ్లైట్ ఏఐ2379 మంగళవారం పుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరింది. గమ్యస్థానానికి చేరుకునే క్రమంలో మార్గమధ్యంలో విమా నం తీవ్రమైన కుదుపులకు గురై, ఒక్కసారిగా 300 అడుగుల మేరకు కిందకు జారిపోయింది. దీంతో విమానంలోని ప్రయాణికులంతా భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో 12 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బంది గాయపడ్డారు. విమానం సురక్షితంగా ఢిల్లీలో ల్యాండ్ అయిన వెంటనే గాయపడిన వారిని చికిత్స నిమిత్తం విమానాశ్రయ వైద్య కేంద్రానికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో దవాఖానకి తరలించి చికిత్స అందిస్తున్నారు. విమానం లోపలి సీలింగ్ భాగాలు దెబ్బతిన్నాయని సమాచారం. ప్రయాణం ప్రారంభమైన గంటన్నర తర్వాత విమానం భారీ కుదుపులకు గురైందని, రెండు మూడు నిమిషాల పాటు భయానక వాతావరణం నెలకొందని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ ఘటనపై పౌరవిమానయాన భద్రతా డైరెక్టరేట్ జనరల్(డీజీసీఏ) దర్యాప్తునకు ఆదేశించింది.

## కర్ణాటక కాంగ్రెస్‌లో అసమ్మతి సెగ..

**-మంత్రి పదవులు దక్కని సిద్ధూ వర్గ ఎమ్మెల్యేల అసంతృప్తి**
**-వెళ్లే వాళ్లు వెళ్లవచ్చన్న డీకే**
**-రాజీనామాను నిమిషాల్లో ఆమోదిస్తానని హెచ్చరిక**

**బెంగళూరు, ఆగస్టు 4 నవ సంఘర్షణ**



కర్ణాటక కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు ఎగసిపడుతున్నాయి. మంత్రి పదవులు దక్కని సిద్ధరామయ్య వర్గ ఎమ్మెల్యేలు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. రాజీనామాలు కూడా చేశారు. దీంతో వెళ్లేవాళ్లు వెళ్లొచ్చని పేర్కొన్న సీఎం డీకే.. వారి రాజీనామాలను నిమిషాల్లో ఆమోదిస్తానని వెల్లడించారు. మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కిన 19 మంది జాబితాపై మాజీ సీఎం సిద్ధరామయ్య అసంతృప్తిగా ఉన్నారు. దీనిపై ఆయన మద్దతుదారులు ముఖ్యమంత్రి డీకే శివకుమార్, అధిష్ఠానాన్ని ఉద్దేశించి మంగళవారం నేరుగానే విమర్శలు చేయగా, మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి గైర్హాజరైన సిద్ధరామయ్య మాత్రం వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారు. లోక్‌భవన్‌లో సోమవారం జరిగిన మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవానికి సిద్ధరామయ్య హాజరు కాకపోవడం ద్వారా తన అసంతృప్తిని అధిష్ఠానానికి తెలియజేశారు. కాగా, సిద్ధరామయ్య పుట్టిన రోజు కావడంతో ఆయన దీనికి హాజరు కాలేదని, 19 మంది మంత్రుల ఎంపిక ప్రక్రియలో ఆయన కూడా పాల్గొన్నారని డీకే వెల్లడించారు. కురుబ వర్గానికి చెందిన బైద్గి ఎమ్మెల్యే బసవరాజ్ శివన్ననవర్‌కు, ఎంఎల్‌సీ ఉమశ్రీకి మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడం పట్ల సిద్ధరామయ్య అసంతృప్తిగా ఉన్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**సహనంతో ఉండాలి**

మంత్రివర్గ విస్తరణ తర్వాత అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అసంతృప్తి ఎమ్మెల్యేలు పార్టీని వదిలి వెళ్లాలనుకుంటే వెళ్లవచ్చని, వారి రాజీనామాలను నిమిషంలో ఆమోదిస్తానని ఆయన ప్రకటించారు. కాగా, మంత్రివర్గ విస్తరణ తర్వాత ఎమ్మెల్యేలు యశ్వంతరాయగౌడ వీ పాటిల్, బెలూర్ గోపాలకృష్ణలు రాజీనామా చేసిన క్రమంలో డీకే ఈ ప్రకటన చేశారు. 'ఎవరైనా రాజీనామా ఇస్తే నిమిషాల వ్యవధిలో దానిని ఆమోదిస్తా' అని మంగళవారం ఆయన పేర్కొన్నారు. అసంతృప్తి ఎమ్మెల్యేలు సహనంతో ఉండాలని, వ్యక్తుల భవిష్యత్ కన్నా పార్టీ ప్రయోజనం ముఖ్యమన్న విషయాన్ని నేతలు గుర్తుంచుకోవాలని అన్నారు.

## సైనిక్ స్కూళ్ల ప్రైవేటీకరణపై రాహుల్ గాంధీ ఆగ్రహం..

### ఆధారాలు చూపించాలన్న ప్రభుత్వం

**న్యూఢిల్లీ :- ఆగస్టు 4 నవ సంఘర్షణ**



దేశంలోని సైనిక స్కూళ్లను ప్రైవేటీకరించడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. సైనిక్ స్కూళ్లను ఆర్‌ఎస్‌ఎస్‌కు అప్పగిస్తున్నారంటూ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి ఆన్ డిఫెన్స్ మెంబర్స్‌కు సంబంధించిన సమావేశం మంగళవారం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశానికి ఈ కమిటీలో సభ్యులైన కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, కార్తీ చిదంబరం, పవన్ ఖేరా, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, బీజేపీ ఎంపీలు రాధా మోహన్ సింగ్, సుధాన్షు త్రివేదితోపాటు పలువురు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సైనిక్ స్కూళ్ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సైనిక్ స్కూళ్లను ప్రైవేటీకరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో అనేక సైనిక స్కూళ్లను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని, ఇదే సమయంలో ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధం కలిగిన వారి చేతుల్లో విద్యాసంస్థల్ని పెడుతున్నారని రాహుల్ ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణల్ని బీజేపీ ఎంపీలు తీవ్రంగా ఖండించారు. దీనిపై ఆధారాలుంటే సమర్పించాలని రాహుల్‌కు సూచించారు. సరైన ఆధారాలు, డాక్యుమెంట్లు లేకుండా ఆరోపణలు చేయడం తగదని సూచించారు. రాహుల్ చేసిన ఆరోపణలపై ఈ కమిటీ చైర్మన్, బీజేపీ ఎంపీ రాధా మోహన్ సింగ్ కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. సైనిక స్కూళ్ల ప్రైవేటీకరణ జరుగుతుందన్న అంశంపై ప్రభుత్వం నుంచి పూర్తి నివేదిక కావాలని ఆయన కోరారు. ఈ అంశంలో ప్రభుత్వ పాత్ర ఎంతవరకు ఉందనేదానిపై విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

## త్వరలో టూవీలర్ అంబులెన్స్‌లు..

### - కొత్త ప్రతిపాదనతో కేంద్రం నోటిఫికేషన్..!



**న్యూఢిల్లీ : ఆగస్టు 4 నవ సంఘర్షణ**

ద్విచక్ర వాహన అంబులెన్సుల కు అనుమతి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 'కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు-1989' కి సవరణలు ప్రతిపాదిస్తూ కేంద్ర రహదారులు, రవాణాశాఖ ముసాయిదా నోటిఫికేషన్ జారీచేసింది. గ్రామీణ, మారుమూల, కొండ ప్రాంతాల్లోని పల్లెలకు వేగవంతమైన వైద్య సేవలు అందించడం కోసం ఈ విధానాన్ని తీసుకొస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ఇప్పటివరకు కేంద్ర మోటారు వాహనాల నిబంధనల పరిధిలో ద్విచక్ర అంబులెన్సులు లేవు. దానివల్ల వాటి రూపురేఖలు, నిర్వహణ, రోగులను హ్యాండ్లింగ్ చేసే విధానం, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ తనిఖీలకు అవసరమైన నిబంధనలు ఖరారు చేయడానికి వీల్లేకుండా పోయింది. నిబంధనలను సవరించడంవల్ల ఈ అంబులెన్సులు ప్రభుత్వ నియంత్రణ పరిధిలోకి రానున్నాయి. ఎల్2 కేటగిరీ ద్విచక్ర వాహనాలను అంబులెన్సులుగా ఉపయోగించడానికి అనుమతిస్తారు. రాష్ట్రాలు నిర్దేశించిన ప్రాంతాల్లోనే ఇవి సేవలు అందించడానికి వీలుంటుంది. ఈ ముసాయిదా నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు ఉన్నవారు 30 రోజుల్లోగా కేంద్ర రహదారులు, రవాణాశాఖకు పంపాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తుది నోటిఫికేషన్‌ను జారీచేయనుంది.

## అమెరికాపై ఆగ్రహం వ్యక్తంచేసిన మొజ్తాబా ఖమేనీ



**న్యూఢిల్లీ :- ఆగస్టు 4 నవ సంఘర్షణ**

అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. ఈ క్రమంలో అమెరికాపై ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్మాణంలో ఉన్న తమ అణు విద్యుత్ కేంద్రంపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించిందని ఆరోపించారు. అమెరికాను 'క్రిమినల్ దేశం ' అని, 'గ్రేట్ సాతాన్ ' అని విమర్శించారు. ఈ సందర్భంగా మొజ్తబా ఖమేనీ తన తండ్రి, ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరైన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ఓ సందేశాన్ని విడుదల చేశారు. ఇంతటి గొప్ప ప్రజాస్పందన ప్రాంతీయ రాజకీయంపరంగా కొత్త మార్పులకు తెరతీసిందని ఆయన అన్నారు. అమెరికా ఆధిపత్యానికి గండికొట్టేందుకు ఇదే నిదర్శనమని ఖమేనీ చెప్పుకొచ్చారు. కాగా జోర్డాన్‌లో ఇరాన్ మద్దతుగల బలగాల దాడిలో అమెరికాకు చెందిన సైనికులు ఇద్దరు మృతిచెందగా.. పలువురు గాయపడినట్లు అమెరికా ఇటీవల ధ్రువీకరించింది. దీనికి అమెరికా ఐఆర్‌జీసీ స్థావరాలు సహా వైమానిక రక్షణ వ్యవస్థలు, క్షిపణులు, డ్రోన్ నిల్వల కేంద్రాలే లక్ష్యంగా ప్రతిదాడులు చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) తెలిపింది. తాజా దాడుల్లో నిర్మాణంలో ఉన్న ఓ అణు విద్యుత్ కేంద్రంపై అమెరికా దాడి చేసిందని ఇరాన్ ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలపై అమెరికా ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

## అమిత్ షా ఎక్కడ?

**న్యూఢిల్లీ ఆగస్టు 4 నవ సంఘర్షణ**



దేశ రాజధానిలో కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంట్ ర్యాలీలో పాల్గొన్న నిరసనకారులపై ఢిల్లీ పోలీసులు జూలై 20న తీవ్రమైన బలప్రయోగం జరిపి రెండు వారాలు గడిచినప్పటికీ కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాత్రం ఇప్పటివరకు పార్లమెంట్‌లోకి అడుగుపెట్టకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. కేంద్ర హోం శాఖ పరిధిలో పనిచేసే ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ యువ నిరసనకారులపై బాష్పవాయువు, మేకులు అమర్చిన లాఠీలు, పెల్లెట్ గన్‌లను ఎందుకు ప్రయోగించాయో వివరణ ఇవ్వాలని ప్రతిపక్షాలు సభలోనూ, వెలుపలా డిమాండ్ చేస్తున్నప్పటికీ అమిత్ షా మాత్రం దీనిపై స్పందించలేదు. ప్రధాన మంత్రి, హోం మంత్రి సభకు హాజరు కాకపోవడం పార్లమెంట్‌కు, ప్రజాస్వామ్యానికి అవమానమని రాజ్యసభలో విపక్ష నాయకుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సోమవారం విమర్శించారు.

## 18 ఏండ్లకే ప్రొఫెసర్.. 306 ఏండ్ల రికార్డు బద్దలు

**ఫ్లోరిడా - ఆగస్టు 4 నవ సంఘర్షణ**



అమెరికాలోని ఫ్లోరిడాకు చెందిన నాథన్ థామస్ 18 ఏండ్ల 346 రోజుల్లోనే అతి పిన్న ప్రొఫెసర్‌గా గిన్నిస్ ప్రపంచ రికార్డుకు ఎక్కి 306 ఏండ్లుగా ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు. అతను ప్రస్తుతం మయామీ డేడ్ కాలేజీలో ఇంజినీరింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా చేరి విద్యార్థులకు పాఠాలు చెబుతున్నాడు. అంతకుముందు ఈ రికార్డు స్కాటిష్ గణిత శాస్త్రవేత్త కోలిన్ మాక్లరిన్ పేరుపై ఉంది. అతను 19 ఏండ్ల వయసులో 1717లో ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు.

# బిజినెస్

# వరుస లాభాలకు బ్రేక్..

## రూ.2,000 దాటిన యూపీఐ పేమెంట్లపై చార్జీలు..

### -కొత్త చట్టంపై కసరత్తు చేస్తున్న కేంద్రం




దేశంలో ప్రస్తుతం యూపీఐ సేవల వినియోగం పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు యూపీఐ సేవలన్నీ ఉచితమే. కానీ, ఇకపై ఈ విధానంలో మార్పు వచ్చే అవకాశం ఉంది. యూపీఐ సేవలపై స్వల్ప ఫీజు వసూలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనికోసం చట్టంలో మార్పులు తీసుకురానుంది. యూపీఐ పేమెంట్స్‌కు సంబంధించి అమలులో ఉన్న పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్‌కు పార్లమెంట్‌లో సవరణలు చేయాలని కేంద్రం భావిస్తోంది.ఈ సవరణ చట్టం అమలులోకి వస్తే యూపీఐ లావాదేవీలపై పరిమితమైన ఛార్జీలు విధిస్తారు. ప్రస్తుతానికి మాత్రం ఎలాంటి ఛార్జీలు విధించడం లేదు. కొత్త చట్టం ద్వారా పేమెంట్ ఇండస్ట్రీ వర్గాల ఎప్పటినుంచో కోరుతున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అమలు చేస్తారు. ఈ ప్రతిపాదిత చట్టం ప్రకారం రూ.2,000 అంతకన్నా ఎక్కువ పేమెంట్స్‌పై 0.3 నుంచి 0.5 శాతం వరకు ఛార్జీ వసూలు చేస్తారు. అయితే, ఈ ఛార్జీని వినియోగదారుడు చెల్లించాల్సిన అవసరం లేదు. పేమెంట్ అందుకున్న వ్యాపారులు మాత్రమే ఈ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే, కొత్త చట్టం ద్వారా యూపీఐ వినియోగదారులపై ఎలాంటి ఛార్జీలు, భారం పడదు. వ్యాపారులు మాత్రమే ఆ మొత్తం చెల్లించాలి. అది కూడా వార్షికాదాయం రూ.1.5 కోట్లు దాటిన వ్యాపారులే. చిన్న వ్యాపారులపై దీని ప్రభావం ఉండదు. భారీ వ్యాపారం చేసే వారిపైనే భారం పడుతుంది.ఈ చట్టం ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉంది. దీన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ఒకవేళ దీన్ని అమలు చేయాలనుకున్నా.. ఎలా అమలుచేయాలి, దీని చట్టబద్ధత వంటి అంశాలపై పరిశీలన జరుగుతోంది. న్యాయపరమైన అంశాల్ని నిపుణులు పరిశీలిస్తున్నారు. ఆ తర్వాతే ఇది పార్లమెంట్‌లో సవరణకు వస్తుంది. అంతవరకు ప్రస్తుతం అమలవుతున్న విధానంలో ఏ మార్పూ లేదు. వినియోగదారులతోపాటు, వ్యాపారులు కూడా అదనంగా ఎలాంటి ఛార్జీలు చెల్లించనవసరం లేదు.

## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు



దేశీయ స్టాక్ మార్కెట్‌లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. నాలుగు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు రేపు వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. దాంతో బ్యాంకింగ్ , ఫైనాన్షియల్ , ఐటీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్ 210.08 పాయింట్లు నష్టపోయి 78,428.95 వద్ద స్థిరపడింది.అదేవిధంగా నిఫ్టీ 159.40 పాయింట్లు క్షీణించి 24,614.90 వద్ద ముగిసింది. రోజంతా నెమ్మదిగా కదులుతూ వచ్చిన నిఫ్టీ, ఒక దశలో 24,428 కనిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు టాప్ లూజర్లుగా నిలిచాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ 2 శాతానికి పైగా పతనమై అత్యధికంగా నష్టపోయింది. నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, నిఫ్టీ బ్యాంక్ సూచీలు కూడా నష్టాల్లోనే ముగిశాయి. అయితే బ్రాడర్ మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.29 శాతం నష్టపోగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.23 శాతం లాభపడింది. వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై ఆర్‌బీఐ గవర్నర్ చేయబోయే వ్యాఖ్యల కోసం మార్కెట్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. ఈ ప్రకటన తర్వాతే మార్కెట్ దిశ, దశ స్పష్టమవుతాయని భావిస్తున్నారు.

## కిమ్స్ లాభం 37 కోట్లు

రాష్ట్రానికి ప్రముఖ హెల్త్‌కేర్ సేవల సంస్థ కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్స్ సైన్సస్(కిమ్స్) నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.37 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.85 కోట్లతో పోలిస్తే 56 శాతం తగ్గింది. ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 36 శాతం వృద్ధితో రూ.1,196 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ బీ భాస్కర్ రావు మాట్లాడుతూ..తొలి త్రైమాసికంలో ఆశాజనక పనితీరు కనబరిచినట్టు, ఈ త్రైమాసికంలో కేరళలో మరో ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురాబోతున్నట్టు ప్రకటించారు. దీంతో పడకల సామర్థ్యం 7,459కి చేరుకున్నదన్నారు.

KIMS HOSPITALS™

# షమీ ఎంపికపై అజిత్ అగార్కర్ క్లారిటీ..

### -ఇంగ్లాండ్ టూర్‌కు దూరం కావడానికి అసలు కారణం ఇదే!



టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక కాకపోవడంపై నెలకొన్న సందిగ్ధతకు బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తెరదించారు. షమీని కావాలనే పక్కన పెట్టలేదని, పూర్తి ఫిట్‌నెస్ లేకపోవడమే అతడు జట్టులో చోటు దక్కించుకోలేకపోవడానికి ప్రధాన కారణమని స్పష్టం చేశారు. ఇంగ్లాండ్ పరిస్థితుల్లో అనుభవజ్ఞుడైన పేసర్‌గా షమీ సేవలు జట్టుకు ఎంతో కీలకమని అగార్కర్ పేర్కొన్నారు. అతడు పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో అందుబాటులో ఉండి ఉంటే, ఎంపికలో మొదటి వరుసలో ఉండేవాడని వెల్లడించారు. అయితే ప్రస్తుతం టెస్టు క్రికెట్‌కు అవసరమైన శారీరక సామర్థ్యాన్ని ఇంకా పూర్తిగా అందుకోలేదని చెప్పారు.వన్డే ప్రపంచకప్ అనంతరం శస్త్రచికిత్స చేయించుకున్న షమీ బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఫిట్‌నెస్ సాధించేందుకు కఠినంగా శ్రమిస్తున్నట్లు అగార్కర్ తెలిపారు. టెస్టు క్రికెట్‌లో ఐదు రోజుల పాటు నిరంతరాయంగా బౌలింగ్ చేయాల్సి ఉండటంతో, కేవలం సాధారణ ఫిట్‌నెస్ సరిపోదని, ఎక్కువ ఓవర్లు వేయగల సామర్థ్యాన్ని కూడా నిరూపించుకోవాల్సి ఉంటుందని ఆయన వివరించారు. ఇంగ్లాండ్ పిచ్‌లపై షమీ వంటి స్వింగ్ బౌలర్ ప్రత్యర్థులకు పెద్ద సవాల్‌గా మారుతాడు. అయినప్పటికీ పూర్తిగా కోలుకోకముందే అతడిని మైదానంలోకి దించడం వల్ల గాయం మళ్లీ తిరగబడే ప్రమాదం ఉందని సెలెక్షన్ కమిటీ భావించినట్లు అగార్కర్ చెప్పారు. షమీ దీర్ఘకాల కెరీర్‌ను దృష్టిలో పెట్టుకుని వైద్య బృందం సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని, తొందరపడి రిస్క్ తీసుకోవాలని బీసీసీఐ భావించడం లేదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి రావడానికి ముందు షమీ దేశవాళీ క్రికెట్‌లో ఆడాల్సి ఉంటుందని అగార్కర్ వెల్లడించారు. రంజీ ట్రోఫీ లేదా ఇతర దేశవాళీ టోర్నీల్లో బౌలింగ్ చేసి మ్యాచ్ ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాలని సూచించారు. మ్యాచ్ ప్రాక్టీస్‌తో పాటు పూర్తి స్థాయి శారీరక సామర్థ్యం సాధించిన తర్వాతే అతడిని మళ్లీ టీమిండియాలోకి ఎంపిక చేసే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. షమీ పూర్తిస్థాయిలో కోలుకుని మునుపటి లయను అందుకుంటే భారత జట్టుకు మళ్లీ కీలక బౌలర్‌గా మారే అవకాశాలు ఉన్నాయని అగార్కర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అతడి రీహాబిలిటేషన్ పురోగతిపై సెలెక్షన్ కమిటీ, బీసీసీఐ వైద్య బృందం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# స్పోర్ట్స్

## మీ సేవలకు ధన్యవాదాలు.. మీరు తదుపరి బాధ్యతల్లోనూ విజయమంతమవ్వాలి..!




భారత జట్టుకు విశేష సేవలందించిన అసిస్టెంట్ కోచ్‌లు రియాన్ టెన్ డస్చేట్, టి.దిలీప్ కుమార్‌కు బీసీసీఐ ధన్యవాదాలు తెలిపింది. కాంట్రాక్ట్ ముగియడంతో ఈ ఇద్దరిని పొడిగించని భారత బోర్డు.. తదుపరి వారు చేపట్టబోయే బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించింది. శ్రీలంక పర్యటనకు టీమిండియా వెళ్లడంతో డస్చేట్, దిలీప్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది బీసీసీఐ.టీమిండియాకు విశేష సేవలందించినందకు అసిస్టెంట్ కోచ్ రియాన్ డస్చేట్, ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్‌లకు ధన్యవాదాలు. భారత జట్టు విజయాల్లో మీ ఇద్దరి అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యం, నిరంతర శ్రమ కీలక పాత్ర పోషించాయి. మీ ఇద్దరి కెరీర్ విజయవంతమవ్వాలని కోరుకుంటున్నాం అని ఎక్స్ పోస్ట్‌లో బీసీసీఐ వెల్లడించింది.శ్రీలంక పర్యటనకు ముందే భారత జట్టు ఇద్దరు సహాయక కోచ్‌ల సేవలకు ఎండ్ కార్డ్ పడింది. ప్రధాన కోచ్ గౌతం గంభీర్ ఏరికోరి తీసుకున్న రియాన్ టెన్ డస్చేట్ వైదొలిగాడు. ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందిస్తున్న టి.దిలీప్ కాంట్రాక్ట్ కూడా ముగిసింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్ అనంతరం డస్కేట్ సమర్పించిన రాజీనామా లేఖను మంగళవారం భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆమోదించింది. అలానే దిలీప్‌ను కూడా సాగనంపింది బీసీసీఐ. దాంతో.. టీమిండియాతో వీరికున్న అనుబంధం ముగిసింది.

## యాషెస్ సిరీస్ ఆడను.. కానీ, ఇంగ్లండ్ జట్టుకు కోచింగ్ ఇవ్వాలనుంది..!



అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన బెన్ స్టోక్స్(దీవఅ ూశీనవం) యూటర్న్ గురించి వస్తున్న వార్తలను ఖండించాడు. వచ్చే ఏడాది యాషెస్ సిరీస్‌లో స్టోక్స్ ఆడే అవకాశాలున్నాయని ఈసీబీ ఎండీ రాబ్ కీ పేర్కొనడం అంతా ఉత్తిదే అని స్టోక్స్ తేల్చేశాడు. తనకు యాషెస్ ఆడాలనే ఉద్దేశం లేదని, కాకపోతే ఇంగ్లండ్ జట్టుకు ప్రధాన కోచ్‌గా సేవలందించాలని ఉందని 35 ఏళ్ల ఈ మాజీ కెప్టెన్ తన మనసులోని మాటను వెల్లడించాడు.ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలిగిన బెన్ స్టోక్స్ కోచ్‌గా అవతారమెత్తాలని అనుకుంటున్నాడు. టెస్టు క్రికెట్‌ను ప్రాణంగా ప్రేమించే అతడు.. తిరిగి కోచ్‌గా ఇంగ్లండ్ జట్టుకు మెలకులు నేర్పాలని ఆరాటపడుతున్నాడు. ఈ విషయాన్ని స్టోక్సే స్వయంగా చెప్పాడు.'నేను లెవల్ త్రీ కోచింగ్‌లో ఉన్నా. ప్రస్తుతం నేను దేశవాళీలో ఆడుతున్నా. పూర్తిగా ఆట మానేశాక నేను కోచింగ్ ఇవ్వాలనుకుంటున్నా. రిటైరైనా.. క్రికెట్‌తో ఎలా కొనసాగాలో నాకు తెలుసు. ఏదో ఒకరోజు ఇంగ్లండ్ కోచ్‌గా పనిచేయడాన్ని నేను ఇష్టపడతాను. ఆటను వదిలేశాక.. నా మనసులో తట్టిన ఆలోచన అదే' అని స్టోక్స్ వివరించాడు. లార్డ్స్ టెస్టులో ఓటమి అనంతరం స్టోక్స్ వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే.ఇంగ్లండ్ టెస్టు క్రికెట్‌ను 'స్టోక్స్‌కు ముందు.. స్టోక్స్ తర్వాత' అని కచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకంటే.. సంప్రదాయ క్రికెట్‌నే నమ్ముకున్న జట్టుకు దూకుడు నేర్పిన కెప్టెన్లలో స్టోక్స్ పేరు ముందు వరసులో ఉంటుంది. ఎంత పెద్ద లక్ష్యమైనా సరే.. వికెట్లు పడుతున్నా సరే.. దంచుడే పరమావధిగా ఆడడం అతడి నైజం. జో రూట్ వారసుడిగా 2022లో టెస్టు పగ్గాలు అందుకున్న స్టోక్స్.. బజ్‌బాల్ ఆటను పరిచయం చేశాడు. బ్రెండన్ మెక్‌కల్లమ్ హెడ్‌కోచ్‌గా, దూకుడే మంత్రగా ఆడే స్టోక్స్ సారథ్యంలో.. సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ వన్డే తరహాలో ఆడడం అలవర్చుకుంది ఇంగ్లండ్. అయితే.. యాషెస్ సిరీస్‌లో పరాజయం, ఆపై స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 1-2తో సిరీస్ ఓటమితో విమర్శలపాలయ్యాడు స్టోక్స్. ఇక టైమ్ వచ్చేసింది అనుకున్నాడేమో లార్డ్స్ టెస్టు మధ్యలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడీ వెటరన్.

# రామాయణ' ట్రైలర్‌కు అశేష స్పందన....

## - కేవలం 4 రోజుల్లో 800 మిలియన్ వ్యూస్!




బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ చిత్రం రామాయణపై ప్రేక్షకుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ప్రముఖ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న ఈ విజువల్ ఎపిక్ కోసం భారతీయ సినీ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు వచ్చిన అద్భుత స్పందన ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం, రామాయణ ట్రైలర్ కేవలం నాలుగు రోజుల్లోనే 800 మిలియన్ వ్యూస్‌ను నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యూస్ కేవలం యూట్యూబ్‌లో వచ్చినవి మాత్రమే కాకుండా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విటర్), ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో నమోదైన మొత్తం వ్యూస్‌గా సినీ వర్గాలు చెబుతున్నాయి.ఒక భారతీయ చిత్ర ట్రైలర్‌కు ఇంత భారీ స్థాయిలో స్పందన రావడం అరుదైన విషయంగా ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీంతో సినిమా విడుదలకు ముందే 'రామాయణ'పై ఉన్న క్రేజ్ ఏ స్థాయిలో ఉందో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ చిత్రంలో రణబీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో నటిస్తుండగా, సాయిపల్లవి సీతాదేవి పాత్రను పోషిస్తున్నారు. ఈ ఇద్దరి లుక్ ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంది. ట్రైలర్‌లో చూపించిన విజువల్స్, పాత్రల డిజైన్, గ్రాండియర్, విజువల్ ఎఫెక్ట్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. అంతేకాదు, ప్రతి పాత్రను అత్యంత సహజంగా, వైభవంగా ఆవిష్కరించేందుకు దర్శకుడు నితీష్ తివారి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు ట్రైలర్ చూస్తేనే అర్థమవుతోంది.వీశీజఱవం 'రామాయణ'ను భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్న చిత్రాల్లో ఒకటిగా భావిస్తున్నారు. అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్, అంతర్జాతీయ స్థాయి టెక్నికల్ టీమ్, భారీ సెట్లు, అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమాను ప్రపంచ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్నారు. ట్రైలర్‌లో కనిపించిన ప్రతి ఫ్రేమ్ కూడా హాలీవుడ్ స్థాయి నాణ్యతను గుర్తు చేస్తోందని సినీ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్ సంగీతం అందిస్తున్నారు. ఆయన సంగీతం సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ట్రైలర్‌లో వినిపించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. నాలుగు రోజుల్లో 800 మిలియన్ వ్యూస్ సాధించడం ద్వారా ఈ చిత్రం విడుదలకు ముందే సంచలనం సృష్టించింది.



## హాట్ అందాలతో సోషల్ మీడియాని హీటెక్కిస్తున్న మృణాల్..

# మిర్జాపూర్' మూవీ నుంచి క్రేజీ ర్యాప్ సాంగ్..

## -'దో నంబరీ' పాట విన్నారా!




ఓటీటీలో భారీ క్రేజ్ సంపాదించుకున్న పాపులర్ ఫ్రాంచైజ్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై సంచలనం సృష్టించడానికి సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే 'మిర్జాపూర్ ది మూవీ' నుంచి మేకర్స్ ఒక క్రేజీ మాస్ ర్యాప్ సాంగ్‌ను విడుదల చేశారు. 'దో నంబరీ' పేరుతో వచ్చిన ఈ హై-వోల్టేజ్ సాంగ్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. ఈ పాటను ప్రముఖ ర్యాపర్ దండా నియోలీవాలా ఆలపించడమే కాకుండా స్వయంగా సాహిత్యాన్ని అందించి, స్వరపరిచారు. 'బందే నంబర్ 1 కే.. ధంధే దో నంబరీ' అంటూ సాగే లిరిక్స్, ఊరమాస్ బీట్స్ యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 4, 2026 న థియేటర్లలో భారీ ఎత్తున విడుదల కానుంది. మరోవైపు అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'మిర్జాపూర్ ది మూవీ' ఆఫీషియల్ ట్రైలర్ ఈ నెల ఆగస్టు 11న విడుదల కానుంది. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్, అమెజాన్ ఎంజిఎమ్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామాను అభినయ్ పండిట్ సినిమాటోగ్రఫీతో, మెహ్రాన్ ఎడిటింగ్‌తో విజువల్ వండర్‌గా తెరకెక్కిస్తున్నారు.



# దేవుడు ఇచ్చిన విరామం!

ఇటీవల 'మైసా' సినిమా కోసం డ్యాన్స్ రిహార్సల్ చేస్తున్న సందర్భంలో తీవ్రంగా గాయపడింది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. డాక్టర్లు ఆరు వారాల విశ్రాంతిని సూచించారు. వారి సలహా మేరకు ప్రస్తుతం ఆమె విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తన కాలి గాయంపై రష్మిక మందన్న ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ ఓ పోస్ట్ పెట్టింది. 'గాయాలు కావడం చిరాకుగా అనిపిస్తుంది. అసలు ఈ గాయం గురించి ఎవరికీ తెలియకూడదనుకున్నా. కానీ తెలిసిపోయింది. ఇలాంటి గాయం కావడం ఇది మూడోసారి. ఎవరూ టెన్షన్ పడొద్దు. ఈ గాయం నొప్పిగా అనిపిస్తున్నా..భరించలేనంతగా ఏమీ లేదు. నేను షూటింగ్స్‌లో బిజీగా ఉంటూ విరామం తీసుకోవడం లేదనే కారణంతో.. దేవుడు ఈ గాయాన్ని చేసి నా వృత్తికి విరామాన్ని ఇచ్చాడేమో అనుకుంటున్నా' అంటూ స్మైలీ ఏమోజీలతో రష్మిక మందన్న చేసిన ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం ఆమె రణబాలి, మైసా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

# బిగ్ బాస్ తెలుగు 10కు ముహూర్తం ఫిక్స్..

## ఆగస్టు 15 నుంచి 'అగ్నిపరీక్ష' ప్రారంభం!




తెలుగు బుల్లితెరపై అత్యంత ప్రజాదరణ పొందిన రియాలిటీ షో 'బిగ్ బాస్ తెలుగు' పదో సీజన్‌కు రంగం సిద్ధమైంది. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ల్యాండ్‌మార్క్ సీజన్‌ను ఆగస్టు 15 నుంచి ప్రారంభిస్తున్నట్లు స్టార్ మా అధికారికంగా ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన పవర్‌ఫుల్ ప్రోమోతో పాటు 'అగ్నిపరీక్ష' అనే థీమ్‌ను కూడా రివీల్ చేయడంతో షోపై అంచనాలు మరింత పెరిగాయి. తాజా పోస్ట్ లో ప్రేక్షకులను ఉత్కంఠలో ముంచెత్తే అగ్నిపరీక్ష... చరిత్ర సృష్టించబోయేది ఎవరు? అనే ట్యాగ్‌లైన్‌తో సీజన్ కాన్సెప్ట్‌పై ఆసక్తిని పెంచింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.పదో సీజన్ కావడంతో ఈసారి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేలా షోను రూపొందించినట్లు తెలుస్తోంది. 'అగ్నిపరీక్ష' కాన్సెప్ట్‌లో భాగంగా కంటెస్టెంట్లకు గత సీజన్ల కంటే మరింత కఠినమైన టాస్కులు, అనూహ్యమైన ట్విస్టులు ఉండనున్నాయని ప్రచారం జరుగుతోంది. హౌస్‌లోకి అడుగుపెట్టిన తొలి రోజు నుంచే పోటీదారులకు గట్టి సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. గత సీజన్లతో పోలిస్తే ఈసారి గేమ్ మరింత కఠినంగా ఉండేలా మేకర్స్ ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈసారి టెలివిజన్ ప్రేక్షకులతో పాటు డిజిటల్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్టార్ మా ఛానెల్‌లో ప్రసారం కావడంతో పాటు జియోహాట్‌స్టార్ ఓటీటీ వేదికలో 24 గంటల లైవ్ స్ట్రీమింగ్ కూడా అందుబాటులో ఉండనుంది. దీంతో హౌస్‌లో జరిగే ప్రతి పరిణామాన్ని ప్రేక్షకులు ఎప్పటికప్పుడు వీక్షించే అవకాశం లభించనుంది. ఇప్పటికే హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో భారీ స్థాయిలో బిగ్ బాస్ హౌస్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం. ఈ సీజన్‌కు కూడా అక్కినేని నాగార్జునే వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. గత కొన్ని సీజన్లలో తన ప్రత్యేక శైలితో ప్రేక్షకులను అలరించిన ఆయన, ఈసారి కొత్త లుక్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారని టాక్ వినిపిస్తోంది. కంటెస్టెంట్ల జాబితాపై ఇప్పటికే సోషల్ మీడియాలో అనేక పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. టీవీ నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లు, జబర్దస్త్ ఆర్టిస్టులు, సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు ఈసారి హౌస్‌లోకి అడుగుపెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే అధికారిక జాబితాను మాత్రం గ్రాండ్ లాంచ్ ఈవెంట్ రోజునే ప్రకటించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రారంభం కానున్న 'బిగ్ బాస్ తెలుగు 10 -- అగ్నిపరీక్ష' మరోసారి బుల్లితెరపై సందడి చేయడానికి సిద్ధమైంది. కొత్త థీమ్, కొత్త టాస్కులు, అనూహ్య ట్విస్టులతో ఈ సీజన్ ప్రేక్షకులకు మరింత వినోదాన్ని అందిస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# గచ్చిబౌలిలో చార్మినార్ సెటప్.

## ప్రభాస్ ఫౌజీ షూటింగ్‌కు సాలిడ్ ప్లాన్!




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా ఫౌజీ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చార్మినార్ సెట్ నిర్మిస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చార్మినార్ నేపథ్యంలో సన్నివేశాలు చిత్రీకరించాలంటే పాతబస్తీ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. అయితే 'ఫౌజీ' బృందం మాత్రం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి--లింగంపల్లి ప్రధాన రహదారిలోని పాత అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను తలపించేలా భారీ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది. నిజమైన కట్టడాన్ని పోలి ఉండేలా అత్యంత నైపుణ్యంతో ఈ సెట్‌ను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.